

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక సోమవారం యథావిధిగా నిర్వహించనున్నారు. సెలవులు, విజయవాడ వరదలు, జిల్లాలో భారీ వర్షాల కారణంగా వరుసగా ఈ కార్యక్రమం రద్దుచేశారు. సోమవారం నుంచి తిరిగి నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు.

బదిలీల జాతర

ప్రభుత్వ శాఖల్లో పలువురికి స్థానచలనం

- జడ్పీ సీఈవోగా నారాయణమూర్తి
- డ్వామా పీడీగా పూర్ణిమ
- డీఆర్‌డీఏ పీడీగా లక్ష్మీపతి
- జిల్లా పౌర సరఫరాల అధికారిగా భాస్కర్
- పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరుగా నీలిమ
- డీపీవోగా శ్రీనివాసరావు కొనసాగింపు
- ఇతర జిల్లాలకు తొమ్మిది మంది ఎంపీడీవోలు
- విశాఖకు నలుగురు తహసీల్దార్లు రాక



లక్ష్మీపతి, డీఆర్‌డీఏ పీడీ



శ్రీనివాసరావు పీఆర్ ఎస్‌ఈ



విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పలు ప్రభుత్వ శాఖలలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. పలువురు జిల్లాస్థాయి అధికారులు ఇక్కడి నుంచి బదిలీ కాగా, మరికొందరు ఇతర జిల్లాల నుంచి వచ్చారు. జిల్లాలో కీలకమైన జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డ్వామా పీడీ తదితర అధికారులుగా కొత్తవారికి పోస్టింగ్ ఇచ్చారు. ఖాళీగా ఉన్న విశాఖపట్నం జడ్పీ సీఈవోగా కాకినాడ డీఎల్‌డీవో పి.నారాయణమూర్తిని నియమించారు. డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణను శ్రీకాకుళం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా బదిలీచేసి, ఆయన స్థానంలో విజయనగరం డీఎల్‌డీవో కె.రాజ్‌కుమార్ నియమించారు. విశాఖపట్నం డ్వామా పీడీ ఇ.సందీప్‌ను విజయనగరం డ్వామా పీడీగా బదిలీచేసి ఆయన స్థానంలో విశాఖ డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమాదేవిని నియమించారు. ఇంకా అనకాపల్లి డ్వామా పీడీగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా పంచాయతీ అధికారిగా ఇప్పటివరకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంపీప శ్రీనివాసరావుకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగుతున్న బి.శ్రీనివాసరావుకు కూడా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణిని మాతృసంస్థ సాంఘిక సంక్షేమశాఖకు సరెండర్ చేసిన ప్రభుత్వం ఆమె స్థానంలో భీమిలి డీఎల్‌డీవో బి.లక్ష్మీపతిని నియమించింది. జిల్లా పౌరసరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావును శ్రీకాకుళం జిల్లాకు బదిలీచేసి, అతని స్థానంలో విజయవాడ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న వి.భాస్కరరావును నియమించింది.పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు కె.రాజేశ్వరిని సంస్థ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న ఎస్.నీలిమకు విశాఖలో పోస్టింగ్ ఇచ్చారు. టెక్కలిలో పనిచేస్తున్న అలివేలు మంగతాయారుకు భీమిలి డీఎల్‌డీవోగా పోస్టింగ్ ఇచ్చారు. ఇదిలావుండగా ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు కేటాయించగా, ఇతర జిల్లాల నుంచి ఎనిమిది మంది ఇక్కడికి వస్తున్నారు. విశాఖపట్నం నుంచి తూర్పుగోదావరికి వి.శ్రీనివాస్, కె.సాయినవీన్, పశ్చిమగోదావరికి ఆర్.లోహిత జయసాగర్, కె.కిరణ్‌కుమార్, కృష్ణా జిల్లాకు సీహెచ్.వెంకటేష్, విగ్గీస్ బక్కా, శ్రీకాకుళం జిల్లాకు ఎం.మన్మథరావు, కె.అప్పలనాయుడు, ఆర్.వెంకటరావులను బదిలీ చేశారు. పశ్చిమగోదావరి నుంచి జె.తేజరత్నం, పి.పద్మజ, విజయనగరం జిల్లా నుంచి పీవీఎస్ ఆంజనేయులు, కృష్ణా జిల్లా నుంచి వీఎస్ నాగేశ్వరరావు, ఎం.సాయిహర్ష, తూర్పుగోదావరి నుంచి కె.అప్పారావు, ఎం.ప్రేమసాగర్, కేవీ.ప్రసాద్ ... మిగతా 6వ పేజీలో

ఏడుగురు సబ్ రిజిస్ట్రార్‌లకు బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖలో సబ్ రిజిస్ట్రార్ల బదిలీల ప్రక్రియ జరిగింది. నగరంలోని డీఐజీ కార్యాలయంలో ఆదివారం విశాఖ డీఐజీ బాలకృష్ణ, విజయనగరం డీఐజీ నాగలక్ష్మి సబ్ రిజిస్ట్రార్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన జాయింట్ ఐజీ సరోజ ప్రక్రియను పర్యవేక్షించారు. నగరంలోని కీలకమైన స్థానాల కోసం పలువురు సబ్ రిజిస్ట్రార్లు మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా సిఫారసు చేయించుకున్నారు. అయితే బదిలీలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలుచేశామని అధికారులు తెలిపారు. సీనియారిటీ, సర్వీస్ ప్రకారం వచ్చిన మార్కుల ఆధారంగా మాత్రమే సబ్ రిజిస్ట్రార్లకు కోరుకున్న స్థానాలను కేటాయించారు. విజయవాడ ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న సంజీవయ్య సూపర్ బజార్ కార్యాలయంలో జాయింట్-1 స్థానం కోరుకున్నారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో పనిచేస్తున్న చక్రపాణి మధురవాడ కార్యాలయాన్ని ఎంపిక చేసుకున్నారు. నర్సీపట్నంలో పనిచేస్తున్న హర్షవర్ధన్ రెడ్డి భీమిలి, కొత్తవలసలో పనిచేస్తున్న తారకేశ్ గాజువాక, విజయనగరం జిల్లా భోగాపురంలో పనిచేస్తున్న ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీలో మొక్కల నిర్వహణ పేరిట నిధులు గోల్‌మాల్

- చక్రం తిప్పుతున్న ఇద్దరు కాంట్రాక్టర్లు

ఉద్యాన శాఖలో అవినీతి మొక్కలు!

- స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూ భార్యల పేరిట కాంట్రాక్టులు
- 60 ప్యాకేజీల్లో 45 వీరికే కేటాయింపు
- సహకరిస్తున్న హార్టీకల్చర్ అధికారులు
- మార్చిలో గడువు ముగిసినా నామినేషన్‌పై కొనసాగింపు
- ఏటా రూ.ఏడు కోట్లు ఖర్చుచేస్తున్న జీవీఎంసీ
- పదిశాతం కూడా పనులు జరగని వైనం



బీచ్‌రోడ్డు శాంతి ఆశ్రమం వద్ద గ్రిల్స్ పైకి పెరిగివున్న మొక్కలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ హార్టీకల్చర్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగర సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ ఇస్తున్న ప్రాధాన్యత కొందరు కాంట్రాక్టర్లు, ఉద్యాన శాఖలో కొందరు అధికారులకు కాసులవర్షం కురిపిస్తోంది. అతి తక్కువకు టెండర్ వేసి, పనులు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు గ్రీన్‌బెల్ట్‌తోపాటు ప్రధానరోడ్లలో సెంటర్ మీడియన్లు, కూడళ్ల వద్ద మొక్కల నిర్వహణ, పచ్చదనం పెంపును గాలికొదిలేస్తున్నారు. దీనివల్ల రూ.కోట్లలో ప్రజాధనం ఖర్చవుతున్నా, క్షేత్రస్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగర పరిధిలో జాతీయరహదారికి ఇరువైపులా వున్న గ్రీన్‌బల్ట్‌తో పాటు సెంటర్ మీడియన్, బీచ్ రోడ్డు, ఇతర ప్రధాన రహదారులకు ఇరువైపులా, సెంటర్‌మీడియన్లు, ప్రధాన కూడళ్లలో పచ్చదనం పెంపొందించడం నగరవాసులు, పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేందుకు జీవీఎంసీలో హార్టీకల్చర్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. ఈ విభాగానికి అధిపతిగా డిప్యూటీ డైరెక్టర్‌తోపాటు నలుగురు అధికారులను నియమించారు. వీరంతా నగరంలో ప్రస్తుతం ఉన్న సెంటర్ మీడియన్లు, గ్రీన్‌బెల్ట్, ముఖ్యకూడళ్లలో మొక్కలను పరిరక్షించడం, పచ్చదనం ఉట్టిపడేలా ల్యాండ్‌స్కేపింగ్, మొక్కలు ఏపుగా పెరిగేలా ఎప్పటికప్పుడు గడ్డి తీసి, నీరు పెట్టడం వంటి పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది.



పోర్టు ఆస్పత్రి వద్ద జాతీయ రహదారి డివైడర్ మధ్యలో పెరిగిపోయిన మొక్కలు

60 ప్యాకేజీలుగా పనులు

నగరమంతటినీ సుమారు 60 ప్యాకేజీలుగా విభజించి మొక్కల పెంపకం, నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పేరుతో ఏడాదికి ఒకసారి టెండర్లు పిలుస్తుంటారు. ఇందుకోసం జీవీఎంసీ ఏటా సుమారు రూ.ఏడు కోట్లు వెచ్చిస్తుంది. టెండర్‌లో ఎవరు తక్కువకు కోట్‌చేస్తే వారికి పనులను అప్పగిస్తారు. కొంత మంది కాంట్రాక్టర్లు ఈ విభాగంలోని అధికారులతో కుమ్మక్కై అతితక్కువకు బిడ్లు వేసి అన్ని ప్యాకేజీలు తమకే దక్కేలా చక్రం తిప్పుతున్నారు. ఏకంగా 40 శాతానికిపైగా లెస్‌కు టెండర్లు వేసి పనులు దక్కించుకోవడం దీనికి ఉదాహరణగా పేర్కొంటున్నారు. టెండరు దక్కిన తర్వాత అధికారులతో అవగాహన ఏర్పరుచుకుని, తూతూమంత్రంగా పనులు చేసి, బిల్లులు వాటాలు వేసుకుని పంచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం బీచ్‌రోడ్డు సెంటర్ మీడియన్లలో మొక్కల నిర్వహణను గాలికి వదిలేయడంతో మొక్కలు సెంటర్‌మీడియన్ గ్రిల్స్ నుంచి పెరిగిపోయి అందవికారంగా కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్యాకేజీ నిర్వహణ దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రతి 15 రోజులకు ఒకసారి గడ్డి ఏరివేయించడం, మొక్కలను ఆకర్షణీయ రూపంలో కనిపించేలా ప్రూనింగ్/కటింగ్ చేయించాలి. సకాలంలో నీటి సదుపాయం కల్పించాలి. కానీ అక్కడి పరిస్థితి పూర్తి విరుద్ధంగా కనిపిస్తోంది. కురుపాం సర్కిల్, పార్క్‌హోటల్ ... మిగతా 6వ పేజీలో



మధురవాడలోని బటర్‌ఫ్లై పార్కు

స్థల మార్పిడికి నో

బటర్‌ఫ్లై పార్కు వ్యవహారంలో స్పష్టం చేసిన సర్కారు

- జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానాన్ని తప్పుపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- మాజీ మంత్రి ముత్తంశెట్టి అనుచరులకు షాక్


విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మధురవాడలోని బటర్‌ఫ్లై పార్కు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, వారి నుంచి మరోచోట స్థలం తీసుకునేలా చేసిన భూ మార్పిడి ప్రక్రియ చెల్లదని మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ సింఘాల్ స్పష్టంచేశారు. ఈ అంశంపై హైకోర్టులో పిల్ దాఖలుచేసిన జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్‌కు ఈ మేరకు లేఖ పంపించారు.

జీవీఎంసీ ఆరో వార్డు పరిధి మధురవాడ సర్వేనంబరు 192/12పి ఎంఎస్ఆర్ లేవుట్‌లో ఓపెన్‌స్పేస్ కింద కేటాయించిన 484.39 గజాల స్థలం జీవీఎంసీకి దఖలుపడింది. ఆ స్థలాన్ని బటర్‌ఫ్లైపార్కుగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ టెండర్లు పిలిచింది. పనులు కూడా ప్రారంభించింది. అదే సమయంలో పార్కుని ఆనుకుని ప్రైవేటు వ్యక్తులకు సర్వేనంబరు 193/1పీలో 484.39 గజాల స్థలం ఉంది. ఆ స్థలానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో జీవీఎంసీ పార్కు స్థలాన్ని తీసుకుని, వెనుక ఉన్న తమ స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించేలా వైసీపీ నేతలు ప్రతిపాదనలు తయారుచేశారు. దీనికి జీవీఎంసీ తీర్మానం అవసరం కావడంతో గత ఏడాది అక్టోబరులో వైసీపీ నేతల ఆదేశాలతో కౌన్సిల్‌లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. దీనిపై తీవ్రస్థాయిలో వివాదం రేగడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని పెండింగ్‌లో ఉంచింది. జీవీఎంసీ అధికారుల నిర్ణయంపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో కేసు వేశారు. పార్కులు, ఓపెన్‌స్పేస్‌లు, మైదానాలు, అటవీ భూములను ఇతర అవసరాలకు వినియోగించడానికి అవకాశం లేదని గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టులు వెలువరించిన తీర్పులు, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన ఉత్తర్వులను కోర్టుకు సమర్పించారు. వీటిని ... మిగతా 6వ పేజీలో

స్వర్ణోత్సవ సంబరం

విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రానికి 50 ఏళ్లు

- 1870లో తొలుత వాతావరణ పరిశీలన కేంద్రం ఏర్పాటు
- 1974 సెప్టెంబరు 23న తుఫాన్ హెచ్చరిక కేంద్రంగా మార్పు
- దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇదొకటి
- రేపు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు



నగరంలోని తుఫాన్ హెచ్చరిక కేంద్రం

రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది... తీరం వెంబడి గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి... మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదు... ఈసారి వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. ఇటువంటి ప్రకటనల ద్వారా వాతావరణంలో మార్పులను ఎప్పటికప్పుడు వెలువరించి ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ.. ఆస్తి, ప్రాణ నష్టాల నుంచి కాపాడుతున్నది తుఫాన్ హెచ్చరిక కేంద్రం. ఈ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేసి సోమవారంతో సరిగ్గా 50 వసంతాలు పూర్తయ్యాయి. తూర్పు తీరంలో తుపాన్ల ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ప్రాంతాల్లో కోస్తా ఉండడంతో భారత ప్రభుత్వం నగరంలో 1974 సెప్టెంబరు 23న తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించనున్నారు.

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

తూర్పు తీరంలో తుపాన్ల ప్రభావానికి గురైన ప్రాంతాల్లో కోస్తా తీరం ఒకటి. ఏటా వరదలతో అపార ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. 1970 దశకంలో వచ్చిన తుపాన్ల తీవ్రతకు కోస్తా, ఒడిశా భారీగా దెబ్బ తిన్నాయి. తుఫాన్ సమాచారం కోసం ఢిల్లీ లేదా చెన్నై, హైదరాబాద్‌లో ఉన్న వాతావరణ శాఖాధికారులపై ఆధారపడాల్సిన రోజులవి. దీనికి తెరదించుతూ కోస్తా, ఒడిశాలో తుఫాన్ హెచ్చరిక కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారత వాతావరణ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసి 1973లో 'సైక్లోన్ డిస్ట్రెస్ మిటిగేషన్ కమిటీ'ని నియమించింది. ఈ కమిటీ అధ్యయనం చేసి విశాఖపట్నం, భువనేశ్వర్‌లో కేంద్రాలు నెలకొల్పాలని సిఫారసు చేసింది. ఫలితంగా 1974 సెప్టెంబరు 23న వాల్తేర్‌లో తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటైంది. దీనికి తొలి డైరెక్టర్‌గా సేన్‌రాయ్ నియమితులయ్యారు.

1870లో వాతావరణ పరిశీలనా కేంద్రం ఏర్పాటు

విశాఖలో 1870లోనే వాతావరణ పరిశీలనా కేంద్రం ఏర్పాటు చేశారు. నీటి పారుదల శాఖ కార్యాలయం ఆవరణలో అబ్జర్వేటరీ నెలకొల్పి బెలూన్లు ఎగురవేసి దాని ఆధారంగా నగరంలో వాతావరణం తెలుసుకునేవారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో విశాఖ ఎయిర్‌పోర్టులో వాతావరణం అందించే (ఫోర్ కాస్టింగ్ యూనిట్) విభాగాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా నిర్వహించే రేడియో సౌండ్ సిస్టమ్ ఆధారంగా ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు బెలూన్లు ఎగురవేసేవారు. తరువాత 1944లో స్టేషన్‌ను సెల్ఫ్ రికార్డింగ్ పరికరాలతో మరింత ఆధునికీకరించారు. మహారాణిపేట నీటి పారుదల శాఖలో నెలకొల్పిన అబ్జర్వేటరీని తీసుకెళ్లి ఎయిర్‌పోర్టుకు మార్చి కొంతకాలం నిర్వహించారు. దీనిన్ని 1949-50లో ఏయూకు తరలించారు. మరింత సమాచారం కోసం ఇదే కేంద్రంలో ఫ్యాన్‌టైప్ రేడియో సౌండ్ సిస్టమ్, రేడియేషన్ యూనిట్, మోటార్స్ రేడియో థియోడోలైట్ యూనిట్లు ప్రారంభించారు. తర్వాత 1961లో ఇక్కడే ... మిగతా 6వ పేజీలో

మెరుగైన సమాచారానికి కృషి



కోస్తాకు తుఫాన్ల తాకిడికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు 1974లో ఇక్కడ తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటైంది. అప్పట్లో అందుబాటులో ఉన్న సమాచారం, పలు రకాల సాధనాల ద్వారా వచ్చే వివరాల మేరకు బులెటిన్లు ఇచ్చేవారు. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడం, కైలాసగిరిపై డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు లభించడంతో ఇప్పుడు కోస్తా ప్రజలకు కచ్చితమైన సమాచారం అందిస్తున్నాం. నా హయాంలో కేంద్రం 50 ఏళ్ల వేడుకలు జరగడం ఆనందంగా ఉంది. భవిష్యతులో తుఫాన్లపై మరింత మెరుగైన సమాచారం అందించేందుకు కృషి చేస్తాం.

- భారతి శ్రీకాంత్ సాభ్డే, డైరెక్టర్, తుఫాన్ హెచ్చరిక కేంద్రం

16 మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్

- అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో 16 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన ముగ్గురు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న మరో ముగ్గురికి విశాఖలో పోస్టింగ్స్ ఇచ్చారు. విశాఖ నుంచి ముగ్గురిని అనకాపల్లికి, అనకాపల్లి జిల్లా నుంచి ఇద్దరిని అల్లూరిసీతారామరాజు జిల్లాకు పంపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ఏవో ఎంబీ అప్పారావును విశాఖ కలెక్టరేట్‌లో మెజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, జి.మాడుగుల తహసీల్దారు పి.లచ్చాపాత్రుడును మహారాణిపేట తహసీల్దారుగా, డుంబ్రిగుడ, అరకు తహసీల్దార్లు నాగమ్మ, ఎ.వేణుగోపాల్‌ను అనకాపల్లి జిల్లాకు బదిలీచేశారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి తహసీల్దారు ఎస్.రాణి అమ్మాజిని విశాఖ కలెక్టరేట్ భూ పరిరక్షణ ప్రత్యేక తహసీల్దారుగా, కోటవురట్ల తహసీల్దారు కె.జానకమ్మను విశాఖ ఆర్డీవో కార్యాలయం ఏవోగా నియమించి, అక్కడ ఉన్న కె.రమాదేవిని అనకాపల్లి జిల్లాకు కేటాయించారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన డి.రవిని కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీచేసి అక్కడ పనిచేస్తున్న కె.జయను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన తహసీల్దారు ఎం.భుజంగరావును ములగాడ తహసీల్దారుగా నియమించి, అక్కడ ఉన్న జె.తారకేశ్వరిని జీవీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్‌గా, శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన పి.అమలను పెదగంట్యాడ తహసీల్దారుగా నియమించారు. అక్కడి తహసీల్దార్ ఎల్.రామారావును అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. విశాఖ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్లుగా గతంలో పోస్టింగ్స్ పొందిన ఎ.శ్రీనివాసరావును అనకాపల్లి, వి.శ్యాంకుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, మాకవరపాలెం తహసీల్దార్లు కె.జయప్రకాష్, ఎంవీ.ప్రసాద్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అల్లూరి, అనకాపల్లి జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు సంబంధిత జిల్లా కలెక్టర్లు పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. విశాఖ జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులపై కలెక్టర్ సంతకం చేసినా వివరాలు వెల్లడికాలేదు.

ఏయూలో డిజీ లాకర్

- 1996 నుంచి విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు డిజిటలీకరణ
- అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ)లో విద్యార్థులకు ప్రత్యేకంగా అకౌంట్
- అందులోనే సర్టిఫికెట్లు నిక్షిప్తం



విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పేపర్ లెస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే అనేక విభాగాల్లో డిజి లాకర్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో ఏయూ అధికారులు విద్యార్థుల ధ్రువపత్రాలను డిజిటలైజ్ చేసే పనిని ప్రారంభించారు. 1996 నుంచి 2023 వరకు వర్సిటీలో చదువుకున్న విద్యార్థులకు సంబంధించిన సుమారు 23 లక్షల ధ్రువపత్రాలను డిజిటలైజ్ చేసే బాధ్యతను ఒక సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. డిజిటలైజ్ చేయిస్తున్న ధ్రువపత్రాలకు సంబంధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా అకౌంట్‌ను ఇవ్వనున్నారు. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్‌లో విద్యార్థులకు అకౌంట్ క్రియేట్ చేస్తారు. అందులో విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్స్ స్టోర్ చేసి ఉంటాయి. విద్యార్థులకు అందించిన అకౌంట్స్‌ను ఓపెన్ చేయాలంటే ఓటీపీ ఎంటర్ చేయాలి. ఓటీపీ ఎంటర్ చేయగానే విద్యార్థులు తమకు కేటాయించిన ఏబీసీ అకౌంట్స్‌లో సర్టిఫికెట్లను చూసుకోవచ్చు. ఇందులో ఒరిజినల్ డిగ్రీ పట్టాలు, మార్కుల జాబితాలు, ఇతర సర్టిఫికెట్లు ఉంటాయి. వాటిని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు నేరుగా అకౌంట్ లాగిన్ ద్వారా అధికారులకు చూపించవచ్చు. విద్యార్థులు ఒక కాలేజీ, వర్సిటీ నుంచి మరో కాలేజీ, వర్సిటీకి వెళ్లినప్పుడు కూడా క్రెడిట్స్‌ను బదిలీ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు వర్సిటీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిజి లాకర్‌లోనే అందుబాటులో ఉంచుతామని అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు వెల్లడించారు.

వాడపల్లిలో విశ్రాంతి గది నిర్మాణానికి విశాఖ వాసి రూ.15.31 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న విశాఖపట్నానికి చెందిన రాము దంపతులు

ఆత్రేయపురం, సెప్టెంబరు 22: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా 500 విశ్రాంతి గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన రాయవరపు సూర్యనారాయణ-సత్యదేవి దంపతుల కుమారుడు రాము దంపతులు ఒక గదికి రూ.15.31 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

ఉద్యోగ భద్రత కోరుతూ నేడు సీఐటీయూ నిరసన

జగదాంబ కూడలి, సెప్టెంబరు 22: కార్మికులకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం కల్పించాలంటూ సోమవారం సీఐటీయూ నిరసన (బ్లాక్ డే) కార్యక్రమం చేపడుతుందని సిటు జిల్లా ప్రధాన కార్యాదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్ డే నిర్వహించాలని పిలుపునిచ్చాయన్నారు. ఉదయం 10 గంటలకు విశాఖ జగదాంబ జంక్షన్ వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్మికులు బ్లాక్ డేలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే అడ్డదారి చట్టాలు తెచ్చి అన్యాయానికి ఒడిగడుతున్నారని దుయ్యబట్టారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచన ఇందులో భాగమేనన్నారు. కనీస వేతనం రూ.25 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నది తమ ప్రధాన డిమాండ్ అన్నారు.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణా నిందితుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 22: రైల్లో గంజాయి రవాణాకు పాల్పడిన నిందితుడిని రైల్వే పోలీసులు పట్టుకుని అతని వద్ద నుంచి రూ.50 వేలు విలువ చేసే పది కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానస్పదంగా కదలాడుతున్న కోరాపుట్‌కు చెందిన సురేష్ పిరిడి అనే వ్యక్తిని అడ్డుకుని విచారించగా, గంజాయి సంచులను గుర్తు తెలియని వ్యక్తికి అందజేసేందుకు వచ్చినట్టు నిర్ధారణ అయిందని రైల్వే పోలీసులు తెలిపారు, కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ అబ్దుల్ ఫరూక్ పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన ఓనం సంబరాలు



ముగ్గు వేస్తున్న కేరళీయులు

మాధవధార, సెప్టెంబరు 22; మురళీనగర్ బిర్లా జంక్షన్ కేరళ కళాసమితి అధ్వర్యంలో ఆదివారం 'ఓన గోషం-2024' పేరిట ఓనం పండుగ ముగింపు ఉత్సవాలు జరిపారు. కేరళీయులంతా కళా సమితికి చేరుకుని కుటుంబాలతో సందడిగా గడిపారు.నగరంలో స్థిరపడినవారంతా ఓ చోట చేరి పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. వేడుకల్లో ముఖ్యఅతిథిగా కేరళ రాష్ట్ర (రన్ని నియోజకవర్గం) ఎమ్మెల్యే ప్రమోద్ నారాయణ్ హాజరై కేరళీయులకు శుభాకాంక్షలు తెలిపారు. కేరళ సంప్రదాయానికి జీవం పోస్తున్న కళా సభ్యుల్ని ఆయన అభినందించారు. వేడుకల్లో కేరళీయుల బృందగానం, నృత్యరీతులు ప్రదర్శించారు. అనంతరం కళాసమితి అధ్యక్షులు మణి ఉన్నితన్ అధ్వర్యంలో సామూహిక ఓనం సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో నగర పోలీసు కమిషనరు శంఖబ్రత బాగ్చీ, అతిథులు హాజరయ్యారు.

'మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 21: ఇటీవల విడుదలైన మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరారు. డాబాగార్డెన్స్ వెంకటేశ్వర థియేటర్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా నిర్మించిన మన్యం ధీరుడు చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో 18ఏళ్లలోపు పిల్లలకు కేవలం రూ.50, పెద్దలకు రూ.100 సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. చిత్ర దర్శకుడు ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మన్యం వీరుడు పోరాట స్ఫూర్తి కలిగించే చిత్రమన్నారు. ఈ సమావేశంలో బాదంగిరి సాయి తదితరులు పాల్గొన్నారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, సెప్టెంబరు 22: మత సామరస్యం, అభివృద్ధి సాధన శాంతితోనే సాధ్యమని నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ పిలుపు మేరకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ హాలులో 'ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్' సంస్థల ఆధ్వర్యంలో శాంతి అభివృద్ధి అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా చైర్మన్ నరవ ప్రకాశరావు సర్వమత ప్రార్థన నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ అన్ని మతాలవారు ఐక్యంగా ఉంటే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు. నేడు అన్ని దేశాలకు న్యూక్లియర్ బాంబులు ఉన్నాయని, రక్షణకు అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ సంక్షేమానికి తగ్గిస్తున్నారన్నారు. ప్రమాదకరమైన ఆయుధాలు లేని ప్రపంచాన్ని సృష్టించాలన్నారు. సమావేశంలో పాల్గొన్నవారంతా శాంతి ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో బ్రహ్మకుమారి బి.కె. రామేశ్వరి, ఏయూ తెలుగు శాఖ ఉపన్యాసకులు డాక్టర్ వెంకటేశ్వర యోగి, మయన్మార్ విద్యార్థులు రాజా దామా, కోన వెంకటకృష్ణారావు, ఉషారాణి, హరగోపాల్ పాల్గొన్నారు.

ప్రజల మన్నన పొందిన పాలన: వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, సెప్టెంబరు 22: వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్నన పొందుతూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. అల్లిపురం 32వ వార్డు నేరెళ్ల కోనేరు సామాజిక భవనం, 33వ వార్డు కుమ్మరి వీధిలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వందరోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన మేలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా, తిరుపతి లడ్డును కూడా కల్తీ చేసి ఎంతో మంది మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఇప్పటికే ప్రజలకు భారంగా ఉన్న చెత్తపన్ను, లాండ్ టైటిలింగ్ చట్టాలు రద్దు చేశారని, పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు పునరుద్ధరించారని తెలిపారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తారన్నారు. టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజా ప్రభుత్వంగా మారుతుందన్నారు. అనంతరం వందరోజుల పాలనకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన దక్షిణ నాయకులు శివప్రసాద్ రెడ్డి, వార్డు కార్పొరేటర్లు కందుల నాగరాజు, భీశెట్టి వసంతలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ సత్యలత, జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఏపీడీ పుణ్యవతి, జనసేన నాయకులు గోపీకృష్ణ, తెలుగు అర్జున్, తెలుగు లక్ష్మి, టీడీపీ నాయకులు దుర్గారెడ్డి,దాసన సత్యనారాయణ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలి'



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 22 : రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. కైలాసపురం లోని డీఎల్‌బీ మైదానంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డీడీలు చెల్లించినా దరఖాస్తుదారులకు ఇళ్లు మంజూరు చేయలేదని, కొన్నిచోట్ల కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోవడంతో వారు 2.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఆపేశారన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రయత్నిస్తోందన్నారు. కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులను త్వరలోనే మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి మాట్లాడుతూ కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు ఇచ్చేందుకు అర్హులను గుర్తించాలని చెప్పారు. ఈ నెలాఖారుకు అధికారుల బదిలీల పర్వం పూర్తవుతుందని, ఆ తర్వాత అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఏ అధికారి పని చేయపోయినా తమ దృష్టికి తీసుకొస్తే దగ్గరుండి చేయిస్తామని భరోసా ఇచ్చారు. దశలవారీగా ప్రతి పని చేస్తామన్నారు. డబ్బులు చెల్లించిన అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషా కిరణ్, 47, 48 వార్డుల కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, గంకల కవిత, ఆయా వార్డుల కూటమి అధ్యక్షులు గార ఈశ్వరరావు, పుక్కళ్ళ పైడికొండ, గంకల అప్పారావు, సనపల కీర్తి, నాయకులు ఆకిరెడ్డి జగదీష్, యాగాటి ఆదిలక్ష్మి, సుజాత, వెంకటేష్, కృష్ణ, రాము పాల్గొన్నారు.

' కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం'

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 22: మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర మాజీ సైనికుల కో-కన్వీనర్ అగ్గాల హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు.. డైమండ్ పార్క్ సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ సైనికుల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 18న క్యాబినెట్ సమావేశంలో చర్చించి మాజీ సైనికుల కార్పొరేషన్‌ని రూ. 10 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు.



సమావేశమైన మాజీ సైనికులు

మాజీ సైనికుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడును, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను కలిసి కార్పొరేషన్ ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశామన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కటకం పూర్ణ చంద్రరావు, మాజీ సైనికులు ఎస్.పాపారావు, జి.నాగభూషణరావు, రవి, కొలగాని అప్పారావు పాల్గొన్నారు.

టమాటా కోసం ఎగబడిన జనం



నరసింహనగర్ రైతుబజారులో కొనుగోలుదారుల క్యూ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 22: టమాట ధర రోజురోజుకు పెరిగి ఆకాశాన్నంటుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినడంతో వాటి దిగుబడి తగ్గింది. దీంతో టమాటాకు గిరాకీ పెరిగింది. రైతుబజార్లలో టమాటా ధరను వ్యాపారులు పెంచారు. దీంతో రైతుబజారులో కిలో రూ.42కి చేరింది. అయినా వినియోగదారులు క్యూలో నిల్చొని కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లలో కిలో రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. మదనపల్లె నుంచి దిగుమతి తక్కువగా రావడంతో వ్యాపారులు సతమతమవుతున్నారు. రైతుబజార్లలో తప్పనిసరై డ్వాక్రా సంఘాల సభ్యులు విక్రయిస్తున్నారు. నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం వినియోగదారులు ఆదివారం బారులు తీరారు.

కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతి కల్పించాలి

▸▸ ప్రధాన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరమణ

మహరాణిపేట, సెప్టెంబరు 22: సీనియర్ ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు కామన్ సీనియారిటీ ద్వారా ఉప విద్యాశాఖ అధికారులకు పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరమణ కోరారు. ఆదివారం ఈ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ప్రధాన ఉపాధ్యాయ సంఘం, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్లను జిల్లా, రాష్ట్ర స్థాయిలోని సమగ్రశిక్షా సెక్టోరల్ అధికారులుగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి సీనియర్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులుగా, డైట్ లెక్చరర్లుగా నియమించాలని కోరారు. సర్వీసు రూల్స్ కోర్టు కేసులో ఉన్నాయనే కారణంతో పరిమితికి మించి పాఠశాల విద్యాశాఖలోని అసిస్టెంట్ డైరెక్టర్లకు ఉప విద్యాశాఖ అధికారులుగా నియమిస్తూ ఇచ్చిన పదోన్నతులను సమీక్షించాలని, డిప్యూటీ ఈవోలుగా పనిచేస్తున్న ఏడీలను వెనక్కి రప్పించి అర్హత గల ప్రధాన ఉపాధ్యాయులు, ఎంఈఓలను కామన్ సీనియారిటీ ద్వారా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని కోరారు. పదో తరగతి పరీక్షలను తెలుగుమాధ్యమంలో నిర్వహించాలని, బ్లూప్రింట్, ప్రశ్నపత్రాలు తెలుగులో విడుదల చేయాలని కోరారు. చెరుకూరి వరి, ఎమ్మెల్సీలు పి.రఘువర్మ, వేపాడ చిరంజీవిరావు, కళా సత్యనారాయణ, పి.జ్యోతి, వేణుగోపాల్, సన్యాసి రాజు, కృష్ణకుమార్, శ్రీనివాస్ రమణాజీ, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'న్యాయం జరిగే వరకు సీపీఎం పోరాటం'

జగదాంబ కూడలి, సెప్టెంబరు 22: ఎల్‌జీ పాలిమర్స్ యాజమాన్యం చేసిన తప్పిదం ఎందరికో శాపంగా మారిందని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. గ్యాస్ లీకు ఘటన నేపథ్యంలో స్థానికంగా ఉన్న ప్రజానీకం ఎన్నో అవస్థలు పడుతున్నారని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేసింది. దాదాపు 370 మంది కాంట్రాక్టు కార్మికులు ఉపాధి లేకుండా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేసింది. హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రాణహాని లేని పరిశ్రమను అందుబాటులోకి తెచ్చి ఉపాధి కల్పించాలని యాజమాన్యాన్ని కోరింది. ఆదివారం సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యుడు జగన్ మాట్లాడారు. ఈ దుర్ఘటనలో చికిత్స పొందుతూ మరణించిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు రూ.కోటి వంతున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంకటాపురంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎల్‌జీ పాలిమర్స్‌తో అప్పటి వైసీపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను బహిర్గతం చేయాలన్నారు.

'పోలీసు శాఖలో దళితులపై వివక్ష తగదు'

సీతంపేట, సెప్టెంబరు 22: దళితులు ఏ స్థానంలో ఉన్నా కుల వివక్ష ఎదుర్కొంటున్నారని, రాష్ట్రపతి హోదా నుంచి కింది స్థాయి గుమస్తా వరకు ఇదే పరిస్థితి ఉందని భీమ్ సేన సంస్థ వ్యవస్థాపకులు రవి సిద్దార్ధ పేర్కొన్నారు. పోలీసు నియామకాల్లో దళితులపై వివక్ష తగదని అన్నారు. ఆదివారం రామాటాకీస్ రోడ్డు అంబేద్కర్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులైన పోలీసు ఉన్నతాధికారులకు ప్రాధాన్యత లేని పోస్టులు ఇస్తున్నారని ఆరోపించారు. విశాఖ రేంజ్‌లో 60 నుంచి 70 స్థానాల్లో ఒకరిద్దరు తప్ప దళిత, ఆదివాసీ ఇన్‌స్పెక్టర్లకు మంచి స్థానాలు కల్పించలేదన్నారు. విశాఖ సిటీ పరిధిలో 16 మంది ఎస్సీ, ఎస్టీ ఇన్‌స్పెక్టర్లను రిజర్వ్‌లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ రేంజ్‌లో ముగ్గురికి మాత్రమే పోస్టింగ్స్ ఇచ్చారని ఇది వివక్ష కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. భీమ్‌సేన కార్యవర్గ సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంబరం

... 5వ పేజీ తరువాయి

సిస్మోలాజికల్ యూనిట్ ఏర్పాటు చేశారు.

సొంత భవనం ఏర్పాటు

ఈ విభాగానికి సొంత భవనం ఏర్పాటు చేయాలన్న తలంపుతో కిర్లంపూడి లేఅవుట్ (ప్రస్తుతం తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఉన్న భవనం)లో 1970లో భవనం నిర్మించి ఏయూలోని రేడియో సౌండ్ యూనిట్‌ను తరలించారు. 2.7 ఎకరాల విస్తీర్ణంతో కూడిన స్థలాన్ని ఏయూ నుంచి 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. అదే సమయంలో ఎస్. బ్యాండ్ (10 సె.మీ.లు) జేఆర్‌సీ తుఫాన్లు పసిగట్టే రాడార్ దేశంలో తొలిసారి డాల్ఫిన్‌నోస్ కొండపై నెలకొల్పారు. ఎయిర్ పోర్టులో వాతావరణ శాఖ కార్యాలయం, ఏయూలో రేడియేషన్ సిస్మోలాజీ యూనిట్ల పర్యవేక్షణకు భారత్ వాతావరణ శాఖ సేన్‌రాయ్‌ను గ్రేడ్-1 అధికారిగా నియమించింది. ఆ క్రమంలోనే 1973లో 'సైక్లోన్ డిస్ట్రెస్ మిటిగేషన్ కమిటీ' సిఫారసు మేరకు 1974 సెప్టెంబరు 23న ఇదే భవనంలో తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటైంది. శాఖాపరమైన మార్పుల నేపథ్యంలో 1986లో ఎయిర్ పోర్టులో ఫోర్‌కాస్టింగ్ యూనిట్ మూసివేసినా నేవీ ఆధ్వర్యంలో అబ్జర్వేటరీ పనిచేస్తోంది. డాల్ఫిన్‌నోస్‌పై ఉండే రాడార్ స్థానంలో 1982లో ఈఈసీ రాడార్ నెలకొల్పి అక్కడ ఉండే ఉపరితల వాతావరణ పరిశీలనా కేంద్రాన్ని తుఫాన్ హెచ్చరిక కేంద్రానికి తీసుకువచ్చారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత విశాఖలో వాతావరణం కోసం పనిచేసే స్టేషన్లను మార్పు చేయడంలో భాగంగా 1983లో వి.శాట్ స్టేషన్ ఏర్పాటు, 1985లో విపత్తు హెచ్చరిక వ్యవస్థ, 2002లో హైవిండ్ స్పీడ్ రికార్డర్, 2003లో ఉపగ్రహాల ద్వారా వచ్చే వాతావరణ డేటా చిత్రాలు, వరల్డ్ స్పేస్ డిజిటల్ రిసీవర్ నెలకొల్పారు. డాల్ఫిన్‌నోస్‌పై ఉన్న రాడార్‌కు బదులుగా కైలాసగిరి కొండపై 2006లో జర్మన్‌కు చెందిన వెదర్‌డాప్లర్ రాడారును నెలకొల్పారు. ఈ కేంద్రం 500 కి.మీ. పరిధిలో వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు ఛాయాచిత్రాలను నిక్షిప్తం చేస్తోంది. ఇంకా 2017లో నౌకాస్టు (మూడు గంటల వ్యవధిలో సంభవించే వాతావరణ మార్పులు తెలిపే) వ్యవస్థ ఏర్పాటైంది.

క్షణాల్లో తుఫాన్లపై సమాచారం

ఈ కేంద్రం ఏర్పాటు తరువాత బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్లపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. అల్పపీడనం నుంచి తుఫాన్‌గా మారి తీరం దాటే వరకు నిరంతరం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు బులెటిన్లుగా విడుదల చేస్తున్నారు. సగటున ఏడాదికి ఒక తుఫాన్ అయినా కోస్తా తీరాన్ని తాకుతున్న నేపథ్యంలో 24 గంటలూ ఈ కేంద్రం ఇస్తున్న సమాచారం ఎంతగానో ఉపయోగపడుతోంది. రైతులకు విలువైన సమాచారం అందిస్తున్నారు. ప్రతిరోజూ వంద మందికి పైగా రైతులు వాతావరణం కోసం ఫోన్లు చేస్తుంటారు. ఉదయం ఆరుగంటలు, మధ్యాహ్నం 1.30 గంటలు, సాయంత్రం ఆరుగంటలు, రాత్రి 11 గంటలకు మత్స్యకారులకు బులెటిన్లు జారీ చేస్తారు. స్వాతంత్ర్యానంతరం ప్రారంభించిన బెలూన్లు విడిచిపెట్టే విధానం ఇప్పటికీ కొనసాగిస్తూ రోజుకు రెండుసార్లు ఉపరితలంలోకి వాటిని పంపిస్తారు.

రేంజ్ నుంచి నగరానికి నలుగురు సీఐలు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌నుంచి నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను నగరానికి కేటాయించారు. రేంజ్‌లో పోస్టింగ్స్ కోసం ఎదురుచూస్తున్న తోటాడ కామేశ్వరరావు, వి. చంద్రశేఖర్ , జి. శంకరరావు, ఎల్. సన్యాసినాయుడు సిటీ పోలీస్ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని డీఐజీ గోపీనాథ జట్టీ ఉత్తర్వులు ఇచ్చారు.

చెస్ టోర్నీలో రిషితకు రజత పతకం

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 22: భువనేశ్వర్‌లో జరిగిన కేంద్రీయ విద్యాలయం సంఘటన్ అండర్-17 బాలికల జాతీయ చెస్ టోర్నీలో విశాఖకు చెందిన కోరుకొండ రిషిత రజత పతకం సాధించింది. ఈ నేపథ్యంలో ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు, కార్యదర్శి మణికంఠరావు, ఇతర ప్రతినిధులు ఆదివారం రిషిత, ఆమెకు కోచ్ రామ్‌కుమార్‌ను అభినందించారు.

బదిలీల జాతర

... 5వ పేజీ తరువాయి

ఉమ్మడి విశాఖ జిల్లాకు రానున్నారు.జోన్-1 పరిధిలో పలువురు తహసీల్దార్లను అంతర జిల్లా బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం నుంచి డి.రవి. ఎం.భుజంగరావు, శ్రీకాకుళం నుంచి పి.అమలను విశాఖపట్నం జిల్లాకు బదిలీ చేశారు. విశాఖపట్నం నుంచి కె.జయను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాకు వచ్చిన ముగ్గురు తహసీల్దార్లకు కలెక్టర్ పోస్టింగ్స్ ఇవ్వనున్నారు.

అటవీశాఖలో...

అటవీశాఖ విశాఖ రేంజ్ ఆఫీసర్ బిర్లంగి రామనరేష్‌ను పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం రేంజ్‌కు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న పీవీ శాస్త్రిని విశాఖ రేంజ్ ఆఫీసర్‌గా నియమించారు. విశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో రేంజ్ఆఫీసర్‌గా పనిచేస్తున్న డి.గంగరాజును కురుపాం రేంజ్‌కు బదిలీచేసి అతని స్థానంలో కె.శ్రీనివాసరావును నియమించారు. కనకమహాలక్ష్మి ఈవో పి.శ్రీనివాసరెడ్డిని నెల్లూరు జిల్లా పెంచలకోన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా బదిలీ చేసిన ప్రభుత్వం, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాతకు ఇక్కడ తాత్కాలిక బాధ్యతలు అప్పగించింది.

రవాణా శాఖలో

రవాణా శాఖలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేస్తున్న వి.సుందర్‌రెడ్డిని విజయవాడలో ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఐఎస్ఎం రామశ్రీని ఇక్కడ జేటీసీగా నియమించారు. డీటీసీ జీసీ రాజారత్నంను విజయవాడ కమిషనర్ కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న జి.ఆదినారాయణను విశాఖ డీటీసీగా బదిలీ చేశారు.

ఏడుగురు సబ్ రిజిస్ట్రార్‌లకు బదిలీ

... 5వ పేజీ తరువాయి

రోహన్‌కుమార్ పెదగంట్యాడ, విజయనగరం జిల్లా చిట్స్‌లో పనిచేస్తున్న కీర్తిప్రియ పెందుర్తి, శ్రీకా కుళం ఆడిట్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ గోపాలపట్నం బదిలీ కోరుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 31లోగా పదవీ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేయవద్దని ప్రభుత్వం సూచించడంతో ఆనందపురంలోని ఆనంద్‌కుమార్‌ను అక్కడే కొనసాగించారు. యూనియన్‌లో రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ డీవీ నారాయణ ఆ కోటాలో అక్కడే కొనసాగడానికి అనుమతించారు. గోపాలపట్నంలో పనిచేస్తున్న మాధవిని అనకాపల్లి జాయింట్-1గా, విజయనగరంలో జాయింట్-1గా పనిచేస్తున్న నిరంజన్‌ను అనకాపల్లిలోని జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పనిచేస్తున్న కమలకు నర్సీపట్నం, ఎలమంచిలిలో పనిచేస్తున్న అప్పారావుకు లంకెలపాలెం, మధురవాడలో పనిచేస్తున్న మోహన్‌రావుకు పార్వతీపురం, నక్కపల్లిలో పనిచేస్తున్న జిలానీ బేగం సబ్బవరం బదిలీ అయ్యారు. పాల కొండ నుంచి సీహెచ్ఎన్ మూర్తిని కె.కోటపాడుకు, అసైన్డ్ ల్యాండ్ వివాదంలో సస్పెన్షన్‌కు గురై కోర్టు ఆదేశాలతో భీమిలిలో విధుల్లో చేరిన సబ్ రిజిస్ట్రార్ తులసీ దాస్ రణస్థలం వెళ్లారు.

ఉద్యానశాఖలో అవినీతి మొక్కలు!

... 5వ పేజీ తరువాయి

సర్కిల్, ఆల్ఎబిలిటీపార్కు ఎదురుగా ఉన్న మినీపార్కులో మొక్కల సంరక్షణ, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం పనులను విస్మరించడంతో పూలమొక్కలన్నీ మాయమైపోయాయి. తుప్పలతో కళావిహీనంగా మారి నగర సుందరీకరణపై ప్రభావం చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ నుంచి గాజువాక, తాటిచెట్లపాలెం నుంచి ఊర్వశిజంక్షన్, మధురవాడ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది వరకూ జాతీయరహదారిపై పరిస్థితి ఇదే విధంగా ఉంది. అయినా అధికారులు పనులు బాగానే చేశారంటూ బిల్లులు చేసే పనిలో నిమగ్నమవడం వారి తీరుకు అద్దం పడుతోంది.

ఇద్దరు కాంట్రాక్టర్లదే హవా

జీవీఎంసీలోని ఉద్యాన విభాగంలో ఇద్దరు కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోందని ఆ విభాగం ఉద్యోగులే చెబుతున్నారు. జీవీఎంసీ పరిధిలో 60 ప్యాకేజీలుంటే అందులో 45 వరకూ వీరే దక్కించుకోవడం దీనికి ఉదాహరణగా చెబుతున్నారు. ఒక ప్యాకేజీలో పనులు చేపట్టేందుకు సగటున ఐదుగురు కూలీలు, ఒక గూడ్స్ ఆటో/ట్రాక్టర్, ఇతర పనిముట్లు అందుబాటులో ఉండాలి.కానీ ఈ కాంట్రాకర్లు తమకు దక్కిన పనులన్నింటినీ పూర్తిచేసేందుకు కేవలం పదిమందిని మాత్రమే నియమించి, వారితోనే నగరమంతటా పనిచేయిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయం ఉద్యానశాఖ అధికారులకు తెలిసినప్పటికీ ప్రశ్నించకపోవడం, బిల్లుల్లో కోత విధించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇద్దరు కాంట్రాక్టర్లు హార్టీకల్చర్ కార్యాలయంలో కూర్చొని సిబ్బందికి బిల్లుల తయారీ, టెండర్ ప్రతిపాదనలపై సూచనలిస్తారని, వారి ఆదేశాలను పాటించకపోతే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో బెదిరింపులు వస్తాయని ఆ విభాగంలోని ఒక అధికారి వాపోయారు. పైగా ఈ కాంట్రాక్టర్లు స్టీల్‌ప్లాంట్‌లో శాశ్వత ఉద్యోగులు. వారి భార్యల పేరుతో కాంట్రాక్టర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని వారే టెండర్‌లో పాల్గొంటారు. ఒక కాంట్రాక్టర్ ఏకకాలంలో రెండు, మూడు పనులను చేయడమే సవాల్‌తో కూడుకున్నదని, ఇద్దరు కాంట్రాక్టర్లే 80 శాతం ప్యాకేజీలను దక్కించుకుంటే పక్కాగా పనులు చేపట్టడం ఎలా సాధ్యమంటున్నారు. అయితే దీనికి సంబంధిత అధికారుల నుంచి సమాధానం రావడం లేదు.

40 శాతానికిపైగా లెస్‌కు

ఏదైనా పని చేపట్టేందుకు అధికారులు ముందుగా అంచనాలు తయారుచేస్తారు. ముడిసరకు, కూలీలు, యంత్రాలకు సంబంధించి ఎస్ఎస్ఆర్ రేట్లు లెక్కించి టెండరు పిలుస్తారు. ఆ మొత్తంలో కాంట్రాక్టర్‌కు 13 శాతం లాభం ఉండేలా చూస్తారు. దీంతో ఎవరైనా కాంట్రాక్టర్ టెండర్ వేస్తే గరిష్ఠంగా 13 శాతానికి మించి లెస్‌కు వస్తే నష్టం వస్తుంది. అలాంటిది హార్టీకల్చర్ విభాగంలో పిలిచే టెండర్లను ఇద్దరు కాంట్రాక్టర్లు ఏకంగా 40 శాతానికిపైగా లెస్‌తోనే దక్కించుకుంటున్నారు. ఉదాహరణకు రూ.10 లక్షల విలువైన పని అనుకుంటే దానిని రూ.ఆరు లక్షలకే చేస్తామని టెండర్ వేస్తున్నారు. ఇందులో ఈఎండీ కింద రూ.2.5శాతం, ఆదాయపన్ను రెండుశాతం, అధికారులు, సిబ్బందికి కమీషన్లు పదిశాతం ఉంటాయి. 25శాతానికి మించి లెస్‌కు వేస్తే ఆ మొత్తాన్ని అడ్వాన్సు సెక్యూరిటీ డిపాజిట్ (ఏఎస్‌డీ) చెల్లించాలి. అంటే 40శాతం లెస్‌కు వస్తే ఏఎస్‌డీ కింద రూ.1.5లక్షలు ముందే కట్టేయాలి. వీటన్నింటినీ లెక్కేస్తే రూ.10 లక్షలు పనికి రూ.నాలుగు లక్షలు, ఇతర ఖర్చులు రూ.2.9 లక్షలు పోతే మిగిలిన రూ.3.1 లక్షలతోనే పూర్తిచేయడం ఎలా సాధ్యమన్నది సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లే చెప్పాలి.

ఏప్రిల్ నుంచి నామినేషన్‌పైనే

సాధారణంగా గడువు పూర్తయ్యేలోగా కొత్త టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవ్వాలి.కానీ హార్టీకల్చర్ విభాగంలో ఈ ఏడాది మార్చితో టెండర్ల గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ పద్ధతితో పాత కాంట్రాక్టర్లనే కొనసాగిస్తున్నారు. ఆరునెలలుగా వారే పనులు చేస్తున్నట్టు అధికారికంగా చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పచ్చదనం మాయమై, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు రూ.3.5 కోట్లు బిల్లులు చెల్లించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

త్వరలో టెండర్లు పిలుస్తాం

ఆరునెలలుగా నామినేషన్ పద్ధతిలో పాత కాంట్రాక్టర్లతోనే పనులు జరుగుతున్నాయి. ఎన్నికల కారణంగా టెండర్లు పిలవడానికి అవకాశం లభించలేదు. కాంట్రాక్టర్లు భారీ లెస్‌కు బిడ్ వేయడం వల్ల పనుల్లో నాణ్యత తగ్గుతుంది. అలాంటివారికి ఏఎస్‌డీ రూపంలో చట్టం అవకాశం కల్పించడంతో ఏమీ చేయలేకపోతున్నాం. ఇకపై ఒక కాంట్రాక్టర్‌కు రెండు, మూడు పనులు మాత్రమే దక్కేలా నిబంధనలు సవరిస్తాం. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు తమ కుటుంబసభ్యుల పేరుతో పనులు చేస్తున్నారు. వారిని కూడా అనర్హులుగా ప్రకటించి టెండర్‌లో పాల్గొనే అవకాశం లేకుండా చేస్తాం. **-దామోదర్, హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్, జీవీఎంసీ**

స్థల మార్పిడికి నో

... 5వ పేజీ తరువాయి

పరిశీలించిన కోర్టు దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీచేసిన ఉత్తర్వుల మేరకు తగిన నిర్ణయం తీసుకుని, పిటిషనర్‌కు తెలియజేయాలని ఆదేశించింది. దీంతో మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీవీఎంసీ పార్కుకు చెందిన భూమి మార్పిడి తగదని, కౌన్సిల్ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు పిటిషనర్ మూర్తి యాదవ్‌కు లేఖ పంపించారు. దీంతో వైసీపీ నేత, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అనుచరులకు షాక్ తగిలినట్టయింది.

తిరుమల లడ్డూ దోషులకు శిక్ష తప్పదు

- హిందువుల మనోభావాన్ని దెబ్బతీసిన గత వైసీపీ సర్కారు
- ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



చట్టివానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారు ఎంతటి వారైనా వారికి శిక్ష తప్పదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. 69వ వార్డు పరిధి నాతయ్యపాలెంలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు అనేక హిందూ దేవాలయాల పవిత్రతను దెబ్బతీయడమే కాకుండా స్వలాభం కోసం తిరుమల లడ్డూను సైతం అపవిత్రం చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇందుకు ప్రతి హిందువు ప్రాయశ్చితం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడడం బాధాకరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో పాటు ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేసి ప్రజలకు తమ ఆస్తులపై పూర్తి రక్షణ కల్పించిందన్నారు. 69వ వార్డులో వరద ముంపు సమస్యతో పాటు రైల్వే ట్రాక్ నివాసితుల సమస్యను పరిష్కరిస్తానని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. టీడీపీ సీనియర్ నాయకుడు అక్కిరెడ్డి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్సీ పి.శేషాద్రి, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, కోన తాతారావు, అలమండ రాజు, కె.ముత్యాలనాయుడు, గోపిశెట్టి గోపి, ఎస్.చిన సన్యాసిరావు, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో ప్రజలందరికీ మేలు

ఆటోనగర్: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్నో పథకాలను అమలు చేసి మేలు మేలు చేకూర్చిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 70వ వార్డు పరిధి చట్టివానిపాలెంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముందుకు సాగుతున్నా రన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం కుట్రలు, కుతంత్రాలకు వేదికగా మారిందని పల్లా పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్సీ శేషాద్రి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కూటమి నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, లంకల మురళీదేవి, పావని, దేనంకొండ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

71వ వార్డు శ్రీనగర్‌లో..

శ్రీనగర్: రాష్ట్రంలో ప్రతి ఇంటికి మంచి చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అభివృద్ధి, సంక్షేమంతో వంద రోజుల్లోనే పాలనలో మార్పు చూపించి మంచి ప్రభుత్వం అనిపించుకుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 71వ వార్డు శ్రీనగర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ దేవస్థానాన్ని కూడా వైసీపీ వదల్లేదని, అవినీతికి అడ్డాగా మార్చుకుని హిందువుల మనోభావాలు దెబ్బతినేలా శ్రీవారి లడ్డూలో వాడే పవిత్రమైన నెయ్యిని కూడా కల్తీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్సీ శేషాద్రి, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, పుప్పు రాజారావు, పప్పు శంకరరావు, కరణం కనకారావు, చైతన్య, కె.సహదేవ్, జి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే ఉక్కును పరిరక్షించుకుందాం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ కేఎం శ్రీనివాస్



స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయూ నాయకులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 22: ప్రజా ఉద్యమాలతో ఆవిర్భవించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అవే ఉద్యమాలతోనే పరిరక్షించుకుందామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ స్టీల్ డివిజన్ ఆధ్వ ర్యంలో ఆదివారం పెదగంట్యాడ కూడలిలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ ప్రజల సొత్తు అని, దీనిని ప్రైవేటు సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టాలని మోదీ ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉక్కు ప్రైవేటీకరణను ఆపేందుకు ప్రయత్నించడం లేదని ఆరోపించారు. ప్లాంటుకు అవసరమైన బొగ్గు ఐరన్ ఓర్ వంటి వాటిని సమకూర్చకుండా కార్మికులు కష్టపడి పనిచేసి ప్లాంటును లాభాల్లోకి తేవాలని కేంద్ర మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్లాంట్ కోసం ఇళ్లు, భూములు అప్పగించిన నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, కర్మాగారం ప్రైవేటుపరమైతే వారికి ఉపాధి అవకాశాలు కలిగే అవకాశమే లేదన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి, సీపీఎం ప్లాంట్ కార్యదర్శి శ్రీనివాసరాజు, సీఐటీయూ నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, భైరెడ్డి గురప్ప, అప్పలరెడ్డి, యు.వెంకటరావు, కె.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కును పూర్తి సామర్థ్యంతో నడపాలి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. కూర్మన్నపాలెంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4,890 కోట్లు ఇస్తే తిరిగి రూ.55 వేల కోట్లు చెల్లించామన్నారు. ప్రైవేటు సంస్థలకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేస్తున్న ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు బ్యాంకుల్లో అప్పు తెచ్చుకునేందుకు గ్యారెంటీ ఇవ్వడం లేదని ఆరోపించారు. నాయకులు జగ్గారావు, ఎం.దానయ్య, సంతోశ్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి

అగనంపూడి: స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ కోరారు. ఇక్కడి కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని వందలాది రోజులుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్లాంటులో మ్యాన్ పవర్‌ను తగించాలనే యోచనను ఉక్కు యాజమాన్యం విరమించుకోకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంగారామ్, సీఐటీయూ నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, మరిడయ్య, వి.రాము, వైటీ దాసు, రమేశ్, కోటి, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ పట్ల బీజేపీ వైఖరి మారాలి

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి మారాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సీఐటీయూ ప్లాంట్ ఆధ్వర్యంలో కర్మాగారం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో ప్లాంట్ అన్ని విధాల నష్టపోయిందన్నారు. కేంద్రం దుర్మార్గ ఆలోచనలతో స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు యు.రామస్వామి, వైటీ దాసు, అప్పారావు, తౌడన్న, రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



తుంగ్లాం శ్మశానవాటికలో శ్రమదానంలో పాల్గొన్న ప్రజలు

శ్రమదానానికి అనూహ్య స్పందన

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 22: తుంగ్లాం శ్మశానవాటికలో శ్రమదానం చేద్దామని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఇచ్చిన పిలుపునకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఆదివారం కార్పొరేటర్ ఆధ్వర్యంలో శ్మశానవాటికలో చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో రెడ్డి తుంగ్లాం, కాపు తుంగ్లాం కాలనీలతో పాటు హరిజన జగ్గయ్యపాలెం, చుక్కవానిపాలెం ప్రాంతాలకు చెందిన వివిధ సంఘాల నాయకులతో పాటు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి, గోతులను పూడ్చి శ్మశానవాటికను సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి అప్పలరెడ్డి, నావన సింహచలం, కోన అప్పారావు, పి.వెంకటరమణ, ఎస్.అచ్చిబాబు, కుంచారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి'

గాజువాక, సెప్టెంబరు 22: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును సస్పెండ్ చేయలాని, దళిత వైద్యులపై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని సస్పెండ్ చేయాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కౌన్సిల్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గాజువాకలో ఆదివారం జరిగిన సమావేశంలో కౌన్సిల్ రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో దళితులపై దాడులు చేశారని, దీంతో దళితులు కూటమి అభ్యర్థులను గెలిపిస్తే వారు కూడా అలాగే ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దళితులకు రక్షణ కల్పించాలని, దళితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బల్ల కుమార్, ప్రసాద్, ఈశ్వరరావు, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్చకుల సత్కార ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

అగనంపూడి, సెప్టెంబరు 22: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో అర్చకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన సత్కార ఆహ్వాన పత్రికలను ఆదివారం రాష్ట్ర అర్చకుల సమైక్య ఉపాధ్యక్షుడు రొంపిచర్ల సింగాచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 25న పలు ఆలయాల అర్చకులను ఘనంగా సత్కరిస్తామన్నారు.

రమేశ్‌బాబుకు కర్ణాటక ప్రభుత్వం సత్కారం



జ్ఞాపికతో రమేశ్‌బాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆటోనగర్‌లోని వీఆర్ ఇంజనీరింగ్ వర్క్స్ ప్రొప్రైటర్ వేమూరి రమేశ్‌బాబును కర్ణాటక ప్రభుత్వం ఆదివా రం ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేసింది. ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్ట్ వ్యాపారంలో ఉన్న రమేశ్‌బాబు బళ్లారిలోని జిందాల్ ప్రాజెక్టులకు కూడా సేవలందిస్తుంటారు. గతనెల వరదల వల్ల తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుపోయింది. దాని స్థానంలో స్టాప్‌బ్లాక్‌ను అమర్చే పనులను కర్ణాటక ప్రభుత్వం జిందాల్ కంపెనీకి అప్పగించింది. ఆ పనులను ఐదు ఎలిమింట్స్‌గా విభజించగా వాటిలో ఒక ఎలిమింట్‌ను అమర్చే బాధ్యతను జిందాల్ కంపెనీ రమేశ్‌బాబుకు అప్పగించింది. ఆయన 72 గంటల్లో ఎలిమింట్‌ను తయారుచేసి అందించడంతో కర్ణాటక ప్రభుత్వం ఆయన్ను సత్కరించి, జ్ఞాపిక అందజేసింది.

వైభవంగా వినాయకునికి పూజలు



గణనాథుని సన్నిధిలో గండి బాబ్జీ, తదితరులు



సరిపల్లిలో గణేశుని ఊరేగింపు

పెందుర్తి, సెప్టెంబరు 22: వినాయక చవితి ఉత్సవాలను పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడి పురుషోత్తపురంలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద ఆదివారం చేపట్టిన అన్న సమారాధనను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రారంభించారు. వందలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా ఆయన గణేశునికి పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చీర అప్పలరాజు, పి.జగన్నాథం, బి.సత్యనారాయణ, త్రినాథ్, దొరబాబు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే సరిపల్లిలో ప్రతిష్ఠించిన గణనాథుని ప్రతిమను మేళతాళాలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆదివారం రాత్రి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టడంతో పాటు ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

పెదగంట్యాడ: శ్రీపెంటమాంబ యువజన సేవా సంఘం నిర్వహించిన వినాయక ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు పులి సురేశ్‌రెడ్డి, హెచ్ఎంఎస్ ప్లాంట్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు, శెట్టిబలిజ యూత్ సభ్యులు డి.పెరుమాళ్లు, రామునాయుడు, ఎస్.నాగరాజు, కె.శంకరరావు, నూకరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో సొసైటీ అభివృద్ధి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 22: సభ్యులందరి సహకారంతో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడంతో పాటు సొసైటీ అభివృద్ధికి పాలక వర్గం కృషి చేస్తుందని భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ సొసైటీ అధ్యక్షుడు కె.రామునాయుడు అన్నారు. సొసైటీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి ఎం.వెంకటరాజు మాట్లాడుతూ సభ్యులు తీసుకునే రుణాలపై వడ్డీని 12 శాతానికి తగ్గించడంతో పాటు వారి శ్రేయస్సు దృష్ట్యా అందరికీ బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు కె.ధర్మారావు, జీటీపీ ప్రకాశ్, జి.ప్రసాద్, ఎన్‌టీ ప్రశాంత్‌కుమార్, మేనేజర్ గవర వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీతో నాయకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం చింతగట్ల గ్రామానికి చెందిన పలువురు నాయకులు వైసీపీకి రాజీనామా చేసి ఆ నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేశారు. ఆదివారం నగరంలోని గండి బాబ్జీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.కనకరాజు, పెదగాడి ఎంపీటీసీ సభ్యుడు ఎన్.అప్పలరాజు, వార్డు సభ్యుడు ఎన్.నాగరాజు, నాయకులు ఇప్పిలి కనకరాజు, కె.ఈశ్వరరావు, ఎన్.గౌరి, తదితరులు టీడీపీలో చేరారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్టు కనకరాజు పేర్కొన్నారు.



జొన్నపొత్తులతో గణేశునికి అర్చన

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 22: జీవీఎంసీ 88వ వార్డు పరిధి ఎస్టీబీఎల్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు చంద్రమౌళీశర్మ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన 516 స్వీట్‌కార్న్ (మొక్కజొన్న పొత్తుల)తో విశేష అర్చన, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వాటిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమం చేశారు.

జిప్సా నూతన కార్యవర్గం

గాజువాక, సెప్టెంబరు 22: గాజువాక ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (జిప్సా) నూతన కార్యవర్గం ఆదివారం గాజువాకలో ఎన్నికైంది. అధ్యక్షునిగా బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.షణ్ముఖరావు, కోశాధికారిగా ఎం.బాబురావు, గౌరవాధ్యక్షునిగా పాలవలస భాస్కరరావు, సలహాదారులుగా జగ్గారావు, శ్రీధర్, జగన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాము, కుమార్, ఇంకా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సత్కరించారు.

యుద్ధాలు వద్దు-శాంతి ముద్దంటూ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, తదితరులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 22: యుద్ధాలు లేకుండా ప్రపంచం శాంతి, సామరస్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ స్థానిక రామకృష్ణ స్కూల్ స్కౌట్ విద్యార్థులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ పి.వాసుదేవరావు, ప్రిన్సిపాల్ లలిత కుమారి మాట్లాడుతూ మనిషి మేధస్సు సమాజ ప్రగతికి దోహదపడాలే కానీ, ప్రపంచం వినాశనానికి దారి తీయకూడదని హితవు పలికారు. యుద్ధాలతో కలిగే అనర్థాలను ప్లకార్డులపై ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. స్కౌట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వేతనాల పెంపునకు కృషి చేయాలి'

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 22: నీటి సరఫరా ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులు తమకు జీతాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌కు వినతిపత్రం అందజేశారు. నీటి సరఫరా విభాగంలో 1,500 మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.13 వేల వేతనం ఇస్తున్నారని వాపోయారు. చాలీచాలని వేతనంతో కుటుంబ జీవనం కష్టంగా మారిందన్నారు. తమకు సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులకు ఇచ్చే వేతనాలను మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్మికులు సాగి సునీల్‌వర్మ, దానప్పలు, గోవింద్, భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ తాగునీటి విభాగంలోని అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌కు పలువురు వినతి పత్రం అందజేశారు. చాలీచాలని వేతనంతో కుటుంబాలతో జీవనం సాగించడం ఇబ్బందికరంగా ఉందని వాపోయారు. తమ వేతనాలు పెంపునకు చొరవ చూపాలని కోరారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో కార్మికులు సూర్యనారాయణ, నరసింగరావు, సన్యాసిరావు, కొండలరావు, బొర్రయ్య, అంజిబాబు, రామకృష్ణ, తదతరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాదే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 24, క్యారెట్ 37, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 105, మునక్కాడలు (కిలో) 56, బరబాటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వె ల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..



గాజువాకలో మాజీ ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

టీటీడీని భ్రష్టు పట్టించిన వైసీపీ

గాజువాకలో జగన్ దిష్టిబొమ్మకు శవయాత్ర

గాజువాక, సెప్టెంబరు 22: తిరుమల తిరుపతి దేవస్థానాన్ని భ్రష్టు పట్టించి, ప్రజల మనోభావాలను గత వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని జీవీఎంసీ 72వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు అన్నారు. టీటీడీ లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడాన్ని నిరసిస్తూ ఆదివారం చినగంట్యాడ నుంచి వంటిల్లు జంక్షన్ వరకు మాజీ ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా భక్తుల మనోభావాలతో జగన్ ఆడుకుని, క్షమించరాని తప్పుచేశారని ధ్వజమెత్తారు. దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పుచ్చా విజయ్‌కుమార్, తమ్మిన విజయ్, సిరసపల్లి నూకరాజు, మాధవరావు, నారాయణ ప్రసాద్, మనోహర్, ఆంజనేయులు, దశరధరామయ్య, ఉషారాణి పాల్గొన్నారు.

వరలక్ష్మీనగర్‌లో రహదారికి మరమ్మతులు



పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

వేపగుంట, సెప్టెంబరు 22: గోతుమయంగా మారిన వరలక్ష్మీనగర్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డుకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. వేపగుంట నుంచి పెందుర్తికి వెళ్లే మార్గంలోని వరలక్ష్మీనగర్ సర్వీసు రోడ్డు, సెంటర్ రహదారులు అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు తాత్కాలికంగా రహదారులకు మరమ్మతులు చేపడుతుండడంతో పలువురు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'గండి బాబ్జీ వైఖరితో టీడీపీ కార్యకర్తలకు అన్యాయం'



వైసీపీ నేత కనకరాజు దౌర్జన్యాలను చిత్రాలతో వివరిస్తున్న టీడీపీ నేతలు

పెందుర్తి, సెప్టెంబరు 22: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ వత్తాసుతో మండలంలోని చింతగట్ల గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి భర్త, వైసీపీ నాయకుడు గనిశెట్టి కనకరాజు 'దేశం' కార్యకర్తలను వేధిస్తున్నట్టు ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ నాయకులు ఇప్పిలి చిన్నారావు, నందవరపు సన్యాసిరావు, దాసరి గణేశ్, చీపురపల్లి నరసింగరావు ఆదివారం పెందుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 19వ తేదీ రాత్రి చింతగట్లలో గ్రామ టీడీపీ కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన ఊరేగింపు కనకరాజు ఇంటి వద్దకు చేరుకునేసరికి అడ్డంగా ఆయన అనుచరులు నిల్చొని దారి లేకుండా చేశారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే టీడీపీ కార్యకర్త దమ్ము రమేశ్‌పై కనకరాజు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. అడ్డుకున్న మరో కార్యకర్త రామును గాయపరిచారన్నారు. తీవ్ర గాయాలైన వారు పెందు ర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దీనిని ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణగా పోలీసులు తారుమారు చేసి కేసు నమోదు చేసినట్టు ఆరోపించారు.

షిప్‌యార్డులో కొండచిలువ హల్‌చల్



కొండచిలువతో గణేశ్

మల్కాపురం, సెప్టెంబరు 22: షిప్‌యార్డులో కొండ చిలువ శనివారం అర్ధరాత్రి సమయంలో హల్‌చల్ చేసింది. కార్మికులు పనుల్లో బిజీగా ఉండగా.. ప్రాంగణంలోకి ఆరడుగుల కొండచిలువ వచ్చింది. దీనిని గమనించిన కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ మేరకు స్నేక్ క్యాచర్ గణేశ్‌కు సమాచారం అందించడంతో ఆయన వచ్చి కొండచిలువను ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఎక్కడైనా పాములు కనిపిస్తే 8688145454 సెల్ నంబర్‌కు కాల్ చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పెదగంట్యాడ, సెప్టెంబరు 22: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన ఆవశ్యకత ఉందని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. శీరంవానిపాలెం యూత్ ఆదివారం నిర్వహించిన ప్రీమియం లీగ్ విండ్‌బాల్ టోర్నమెంటును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధించిన క్రీడాకారులకు వివిధ ప్రభుత్వ శాఖల్లో, పరిశ్రమల్లోనూ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల యువత మానసిక, శారీరక బలం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాదా బాలకృష్ణ, శీరం చిన్నోడు, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

పెదగంట్యాడ, సెప్టెంబరు 22: సావిత్రిబాయిపూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్) ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధిత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు, ఎరైజర్లను పంపిణీ చేశారు. స్పెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి వీటిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా శరీర అవయవ దాతల సంఘం ప్రతినిధులు పీవీఎస్ఆర్ ప్రసాద్, ఎస్.బాజీ, పాండురంగారావు, అనంతపురం స్పెక్ట్ ట్రస్టీ ఎస్.తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

వెనక్కి మళ్లిన సంద్రం



సముద్రం వెనక్కి వెళ్లడంతో రాళ్లపై సందడి చేస్తున్న సందర్శకులు

నగర పరిధిలోని తీరం వెంబడి సముద్రం కొంత వెనక్కి వెళ్లింది. నెల రోజుల వ్యవధిలో సముద్రం ఇలా వెనక్కి వెళ్లడం ఇది నాలుగోసారి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదివారం చాలావరకు వెనక్కి వెళ్లడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పలువురు వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. దీనికి గల కారణాలపై నిపుణులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

వాడపల్లిలో విశ్రాంతి గది నిర్మాణానికి విశాఖ వాసి రూ.15.31 లక్షల విరాళం


విరాళం అందిస్తున్న విశాఖపట్నానికి చెందిన రాము దంపతులు

ఆత్రేయపురం, సెప్టెంబరు 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా 500 విశ్రాంతి గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన రాయవరపు సూర్యనారాయణ-సత్యదేవి దంపతుల కుమారుడు రాము దంపతులు ఒక గదికి రూ.15.31 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

ఉద్యోగ భద్రత కోరుతూ నేడు సీఐటీయూ నిరసన

జగదాంబ కూడలి, సెప్టెంబరు 22: కార్మికులకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం కల్పించాలంటూ సోమవారం సీఐటీయూ నిరసన (బ్లాక్ డే) కార్యక్రమం చేపడుతుందని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్ డే నిర్వహించాలని పిలుపునిచ్చాయన్నారు. ఉదయం 10 గంటలకు విశాఖ జగదాంబ జంక్షన్ వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్మికులు బ్లాక్ డేలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే అడ్డదారి చట్టాలు తెచ్చి అన్యాయానికి ఒడిగడుతున్నారని దుయ్యబట్టారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచన ఇందులో భాగమేనన్నారు. కనీస వేతనం రూ.25 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నది తమ ప్రధాన డిమాండ్ అన్నారు.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణా నిందితుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 22: రైల్లో గంజాయి రవాణాకు పాల్పడిన నిందితుడిని రైల్వే పోలీసులు పట్టుకుని అతని వద్ద నుంచి రూ.50 వేలు విలువ చేసే పది కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానస్పదంగా కదలాడుతున్న కోరాపుట్‌కు చెందిన సురేష్ పిరిడి అనే వ్యక్తిని అదుపుకుని విచారించగా, గంజాయి సంచులను గుర్తు తెలియని వ్యక్తికి అందజేసేందుకు వచ్చినట్టు నిర్ధారణ అయిందని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ అబ్దుల్ ఫరూక్ పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన ఓనం సంబరాలు


ముగ్గు వేస్తున్న కేరళీయులు

మాధవధార, సెప్టెంబరు 22; మురళీనగర్ బిర్లా జంక్షన్ కేరళ కళాసమితి అధ్వర్యంలో ఆదివారం 'ఓన గోషం-2024' పేరిట ఓనం పండుగ ముగింపు ఉత్సవాలు జరిపారు. కేరళీయులంతా కళా సమితికి చేరుకుని కుటుంబాలతో సందడిగా గడిపారు.నగరంలో స్థిరపడినవారంతా ఓ చోట చేరి పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. వేడుకల్లో ముఖ్యఅతిథిగా కేరళ రాష్ట్ర (రన్ని నియోజకవర్గం) ఎమ్మెల్యే ప్రమోద్ నారాయణ్ హాజరై కేరళీయులకు శుభాకాంక్షలు తెలిపారు. కేరళ సంప్రదాయానికి జీవం పోస్తున్న కళా సభ్యుల్ని ఆయన అభినందించారు. వేడుకల్లో కేరళీయుల బృందగానం, నృత్యరీతులు ప్రదర్శించారు. అనంతరం కళాసమితి అధ్యక్షులు మణి ఉన్నితన్ ఆధ్వర్యంలో సామూహిక ఓనం సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో నగర పోలీసు కమిషనరు శంఖబ్రత బాగ్చీ, అతిథులు హాజరయ్యారు.

'మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 21: ఇటీవల విడుదలైన మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరారు. డాబాగార్డెన్స్ వెంకటేశ్వర థియేటర్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా నిర్మించిన మన్యం ధీరుడు చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో 18ఏళ్లలోపు పిల్లలకు కేవలం రూ.50, పెద్దలకు రూ.100 సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. చిత్ర దర్శకుడు ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మన్యం వీరుడు పోరాట స్ఫూర్తి కలిగించే చిత్రమన్నారు. ఈ సమావేశంలో బాదంగిరి సాయి తదితరులు పాల్గొన్నారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం


సమావేశంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, సెప్టెంబరు 22: మత సామరస్యం, అభివృద్ధి సాధన శాంతితోనే సాధ్యమని నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ పిలుపు మేరకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ హాలులో 'ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్' సంస్థల ఆధ్వర్యంలో శాంతి అభివృద్ధి అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా చైర్మన్ నరవ ప్రకాశరావు సర్వమత ప్రార్థన నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ అన్ని మతాలవారు ఐక్యంగా ఉంటే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు. నేడు అన్ని దేశాలకు న్యూక్లియర్ బాంబులు ఉన్నాయని, రక్షణకు అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ సంక్షేమానికి తగ్గిస్తున్నారన్నారు. ప్రమాదకరమైన ఆయుధాలు లేని ప్రపంచాన్ని సృష్టించాలన్నారు. సమావేశంలో పాల్గొన్నవారంతా శాంతి ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో బ్రహ్మకుమారి బి.కె. రామేశ్వరి, ఏయూ తెలుగు శాఖ ఉపన్యాసకులు డాక్టర్ వెంకటేశ్వర యోగి, మయన్మార్ విద్యార్థులు రాజా దామా, కోన వెంకటకృష్ణారావు, ఉషారాణి, హరగోపాల్ పాల్గొన్నారు.

ప్రజల మన్నన పొందిన పాలన: వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, సెప్టెంబరు 22: వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్నన పొందుతూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. అల్లిపురం 32వ వార్డు నేరెళ్ల కోనేరు సామాజిక భవనం, 33వ వార్డు కుమ్మరి వీధిలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వందరోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన మేలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా, తిరుపతి లడ్డును కూడా కల్తీ చేసి ఎంతో మంది మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఇప్పటికే ప్రజలకు భారంగా ఉన్న చెత్తపన్ను, లాండ్ టైటిలింగ్ చట్టాలు రద్దు చేశారని, పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు పునరుద్ధరించారని తెలిపారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తారన్నారు. టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజా ప్రభుత్వంగా మారుతుందన్నారు. అనంతరం వందరోజుల పాలనకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన దక్షిణ నాయకులు శివప్రసాద్ రెడ్డి, వార్డు కార్పొరేటర్లు కందుల నాగరాజు, భీశెట్టి వసంతలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ సత్యలత, జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఏపీడీ పుణ్యవతి, జనసేన నాయకులు గోపీకృష్ణ, తెలుగు అర్జున్, తెలుగు లక్ష్మి, టీడీపీ నాయకులు దుర్గారెడ్డి,దాసన సత్యనారాయణ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలి'


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 22 : రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. కైలాసపురంలోని డీఎల్‌బీ మైదానంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డీడీలు చెల్లించినా దరఖాస్తుదారులకు ఇళ్లు మంజూరు చేయలేదని, కొన్నిచోట్ల కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోవడంతో వారు 2.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఆపేశారన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రయత్నిస్తోందన్నారు. కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులను త్వరలోనే మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి మాట్లాడుతూ కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు ఇచ్చేందుకు అర్హులను గుర్తించాలని చెప్పారు. ఈ నెలాఖారుకు అధికారుల బదిలీల పర్వం పూర్తవుతుందని, ఆ తర్వాత అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఏ అధికారి పని చేయపోయినా తమ దృష్టికి తీసుకొస్తే దగ్గరుండి చేయిస్తామని భరోసా ఇచ్చారు. దశలవారీగా ప్రతి పని చేస్తామన్నారు. డబ్బులు చెల్లించిన అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషా కిరణ్, 47, 48 వార్డుల కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, గంకల కవిత, ఆయా వార్డుల కూటమి అధ్యక్షులు గార ఈశ్వరరావు, పుక్కళ్ళ పైడికొండ, గంకల అప్పారావు, సనపల కీర్తి, నాయకులు ఆకిరెడ్డి జగదీష్, యాగాటి ఆదిలక్ష్మి, సుజాత, వెంకటేష్, కృష్ణ, రాము పాల్గొన్నారు.

'కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం'

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 22: మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర మాజీ సైనికుల కో-కన్వీనర్ అగ్గాల హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు.. డైమండ్ పార్క్ సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ సైనికుల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 18న క్యాబినెట్ సమావేశంలో చర్చించి మాజీ సైనికుల కార్పొరేషన్‌ని రూ. 10 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు.


సమావేశమైన మాజీ సైనికులు

మాజీ సైనికుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడును, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను కలిసి కార్పొరేషన్ ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశామన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కటకం పూర్ణ చంద్రరావు, మాజీ సైనికులు ఎస్.పాపారావు, జి.నాగభూషణరావు, రవి, కొలగాని అప్పారావు పాల్గొన్నారు.

టమాటా కోసం ఎగబడిన జనం


నరసింహనగర్ రైతుబజారులో కొనుగోలుదారుల క్యూ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 22: టమాట ధర రోజురోజుకు పెరిగి ఆకాశాన్నంటుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినడంతో వాటి దిగుబడి తగ్గింది. దీంతో టమాటాకు గిరాకీ పెరిగింది. రైతుబజార్లలో టమాటా ధరను వ్యాపారులు పెంచారు. దీంతో రైతుబజారులో కిలో రూ.42కి చేరింది. అయినా వినియోగదారులు క్యూలో నిల్చొని కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లలో కిలో రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. మదనపల్లె నుంచి దిగుమతి తక్కువగా రావడంతో వ్యాపారులు సతమతమవుతున్నారు. రైతుబజార్లలో తప్పనిసరై డ్వాక్రా సంఘాల సభ్యులు విక్రయిస్తున్నారు. నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం వినియోగదారులు ఆదివారం బారులు తీరారు.

కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతి కల్పించాలి

▸▸ ప్రధాన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరమణ

మహారాణిపేట, సెప్టెంబరు 22: సీనియర్ ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు కామన్ సీనియారిటీ ద్వారా ఉప విద్యాశాఖ అధికారులకు పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరమణ కోరారు. ఆదివారం ఈ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ప్రధాన ఉపాధ్యాయ సంఘం, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్లను జిల్లా, రాష్ట్ర స్థాయిలోని సమగ్రశిక్షా సెక్టోరల్ అధికారులుగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి సీనియర్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులుగా, డైట్ లెక్చరర్లుగా నియమించాలని కోరారు. సర్వీసు రూల్స్ కోర్టు కేసులో ఉన్నాయనే కారణంతో పరిమితికి మించి పాఠశాల విద్యాశాఖలోని అసిస్టెంట్ డైరెక్టర్లకు ఉప విద్యాశాఖ అధికారులుగా నియమిస్తూ ఇచ్చిన పదోన్నతులను సమీక్షించాలని, డిప్యూటీ ఈవోలుగా పనిచేస్తున్న ఏడీలను వెనక్కి రప్పించి అర్హత గల ప్రధాన ఉపాధ్యాయులు, ఎంఈఓలను కామన్ సీనియారిటీ ద్వారా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని కోరారు. పదో తరగతి పరీక్షలను తెలుగుమాధ్యమంలో నిర్వహించాలని, బ్లూప్రింట్, ప్రశ్నపత్రాలు తెలుగులో విడుదల చేయాలని కోరారు. చెరుకూరి వరి, ఎమ్మెల్సీలు పి.రఘువర్మ, వేపాడ చిరంజీవిరావు, కళా సత్యనారాయణ, పి.జ్యోతి, వేణుగోపాల్, సన్యాసి రాజు, కృష్ణకుమార్, శ్రీనివాస్ రమణాజీ, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'న్యాయం జరిగే వరకు సీపీఎం పోరాటం'

జగదాంబ కూడలి, సెప్టెంబరు 22: ఎల్‌జీ పాలిమర్స్ యాజమాన్యం చేసిన తప్పిదం ఎందరికో శాపంగా మారిందని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. గ్యాస్ లీకు ఘటన నేపథ్యంలో స్థానికంగా ఉన్న ప్రజానీకం ఎన్నో అవస్థలు పడుతున్నారని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేసింది. దాదాపు 370 మంది కాంట్రాక్టు కార్మికులు ఉపాధి లేకుండా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేసింది. హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రాణహాని లేని పరిశ్రమను అందుబాటులోకి తెచ్చి ఉపాధి కల్పించాలని యాజమాన్యాన్ని కోరింది. ఆదివారం సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యుడు జగన్ మాట్లాడారు. ఈ దుర్ఘటనలో చికిత్స పొందుతూ మరణించిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు రూ.కోటి వంతున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంకటాపురంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎల్‌జీ పాలిమర్స్‌తో అప్పటి వైసీపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను బహిర్గతం చేయాలన్నారు.

'పోలీసు శాఖలో దళితులపై వివక్ష తగదు'

సీతంపేట, సెప్టెంబరు 22: దళితులు ఏ స్థానంలో ఉన్నా కుల వివక్ష ఎదుర్కొంటున్నారని, రాష్ట్రపతి హోదా నుంచి కింది స్థాయి గుమస్తా వరకు ఇదే పరిస్థితి ఉందని భీమ్ సేన సంస్థ వ్యవస్థాపకులు రవి సిద్దార్థ పేర్కొన్నారు. పోలీసు నియామకాల్లో దళితులపై వివక్ష తగదని అన్నారు. ఆదివారం రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులైన పోలీసు ఉన్నతాధికారులకు ప్రాధాన్యత లేని పోస్టులు ఇస్తున్నారని ఆరోపించారు. విశాఖ రేంజ్‌లో 60 నుంచి 70 స్థానాల్లో ఒకరిద్దరు తప్ప దళిత, ఆదివాసీ ఇన్‌స్పెక్టర్లకు మంచి స్థానాలు కల్పించలేదన్నారు. విశాఖ సిటీ పరిధిలో 16 మంది ఎస్సీ, ఎస్టీ ఇన్‌స్పెక్టర్లను రిజర్వ్‌లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ రేంజ్‌లో ముగ్గురికి మాత్రమే పోస్టింగ్స్ ఇచ్చారని ఇది వివక్ష కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. భీమ్‌సేన కార్యవర్గ సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంబరం

... 5వ పేజీ తరువాయి

సిస్మోలాజికల్ యూనిట్ ఏర్పాటు చేశారు.

సొంత భవనం ఏర్పాటు

ఈ విభాగానికి సొంత భవనం ఏర్పాటు చేయాలన్న తలంపుతో కిర్లంపూడి లేఅవుట్ (ప్రస్తుతం తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఉన్న భవనం)లో 1970లో భవనం నిర్మించి ఏయూలోని రేడియో సౌండ్ యూనిట్‌ను తరలించారు. 2.7 ఎకరాల విస్తీర్ణంతో కూడిన స్థలాన్ని ఏయూ నుంచి 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. అదే సమయంలో ఎస్. బ్యాండ్ (10 సె.మీ.లు) జేఆర్‌సీ తుఫాన్లు పసిగట్టే రాడార్ దేశంలో తొలిసారి డాల్ఫిన్‌నోస్ కొండపై నెలకొల్పారు. ఎయిర్ పోర్టులో వాతావరణ శాఖ కార్యాలయం, ఏయూలో రేడియేషన్ సిస్మోలాజీ యూనిట్ల పర్యవేక్షణకు భారత్ వాతావరణ శాఖ సేన్‌రాయ్‌ను గ్రేడ్-1 అధికారిగా నియమించింది. ఆ క్రమంలోనే 1973లో 'సైక్లోన్ డిస్ట్రెస్ మిటిగేషన్ కమిటీ' సిఫారసు మేరకు 1974 సెప్టెంబరు 23న ఇదే భవనంలో తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటైంది. శాఖాపరమైన మార్పుల నేపథ్యంలో 1986లో ఎయిర్ పోర్టులో ఫోర్‌కాస్టింగ్ యూనిట్ మూసివేసినా నేవీ ఆధ్వర్యంలో అబ్జర్వేటరీ పనిచేస్తోంది. డాల్ఫిన్‌నోస్‌పై ఉండే రాడార్ స్థానంలో 1982లో ఈఈసీ రాడార్ నెలకొల్పి అక్కడ ఉండే ఉపరితల వాతావరణ పరిశీలనా కేంద్రాన్ని తుఫాన్ హెచ్చరిక కేంద్రానికి తీసుకువచ్చారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత విశాఖలో వాతావరణం కోసం పనిచేసే స్టేషన్లను మార్పు చేయడంలో భాగంగా 1983లో వి.శాట్‌స్టేషన్ ఏర్పాటు, 1985లో విపత్తు హెచ్చరిక వ్యవస్థ, 2002లో హైవిండ్ స్పీడ్ రికార్డర్, 2003లో ఉపగ్రహాల ద్వారా వచ్చే వాతావరణ డేటా చిత్రాలు, వరల్డ్ స్పేస్ డిజిటల్ రిసీవర్ నెలకొల్పారు. డాల్ఫిన్‌నోస్‌పై ఉన్న రాడార్‌కు బదులుగా కైలాసగిరి కొండపై 2006లో జర్మన్‌కు చెందిన వెదర్‌డాప్లర్ రాడారును నెలకొల్పారు. ఈ కేంద్రం 500 కి.మీ. పరిధిలో వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు ఛాయాచిత్రాలను నిక్షిప్తం చేస్తోంది. ఇంకా 2017లో నౌకాస్టు (మూడు గంటల వ్యవధిలో సంభవించే వాతావరణ మార్పులు తెలిపే) వ్యవస్థ ఏర్పాటైంది.

క్షణాల్లో తుఫాన్లపై సమాచారం

ఈ కేంద్రం ఏర్పాటు తరువాత బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్లపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. అల్పపీడనం నుంచి తుఫాన్‌గా మారి తీరం దాటే వరకు నిరంతరం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు బులెటిన్లగా విడుదల చేస్తున్నారు. సగటున ఏడాదికి ఒక తుఫాన్ అయినా కోస్తా తీరాన్ని తాకుతున్న నేపథ్యంలో 24 గంటలూ ఈ కేంద్రం ఇస్తున్న సమాచారం ఎంతగానో ఉపయోగపడుతోంది. రైతులకు విలువైన సమాచారం అందిస్తున్నారు. ప్రతిరోజూ వంద మందికి పైగా రైతులు వాతావరణం కోసం ఫోన్లు చేస్తుంటారు. ఉదయం ఆరుగంటలు, మధ్యాహ్నం 1.30 గంటలు, సాయంత్రం ఆరుగంటలు, రాత్రి 11 గంటలకు మత్స్యకారులకు బులెటిన్లు జారీ చేస్తారు. స్వాతంత్ర్యానంతరం ప్రారంభించిన బెలూన్లు విడిచిపెట్టే విధానం ఇప్పటికీ కొనసాగిస్తూ రోజుకు రెండుసార్లు ఉపరితలంలోకి వాటిని పంపిస్తారు.

రేంజ్ నుంచి నగరానికి నలుగురు సీఐలు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌నుంచి నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను నగరానికి కేటాయించారు. రేంజ్‌లో పోస్టింగ్స్ కోసం ఎదురుచూస్తున్న తోటాడ కామేశ్వరరావు, వి. చంద్రశేఖర్ , జి. శంకరరావు, ఎల్. సన్యాసినాయుడు సిటీ పోలీస్ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని డీఐజీ గోపీనాథ జట్టీ ఉత్తర్వులు ఇచ్చారు.

చెస్ టోర్నీలో రిషితకు రజత పతకం

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 22: భువనేశ్వర్‌లో జరిగిన కేంద్రీయ విద్యాలయం సంఘటన్ అండర్-17 బాలికల జాతీయ చెస్ టోర్నీలో విశాఖకు చెందిన కోరుకొండ రిషిత రజత పతకం సాధించింది. ఈ నేపథ్యంలో ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు, కార్యదర్శి మణికంఠరావు, ఇతర ప్రతినిధులు ఆదివారం రిషిత, ఆమెకు కోచ్ రామ్‌కుమార్‌ను అభినందించారు.

బదిలీల జాతర

... 5వ పేజీ తరువాయి

ఉమ్మడి విశాఖ జిల్లాకు రానున్నారు.జోన్-1 పరిధిలో పలువురు తహసీల్దార్లను అంతర జిల్లా బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం నుంచి డి.రవి. ఎం. భుజంగరావు, శ్రీకాకుళం నుంచి పి.అమలను విశాఖపట్నం జిల్లాకు బదిలీ చేశారు. విశాఖపట్నం నుంచి కె.జయను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాకు వచ్చిన ముగ్గురు తహసీల్దార్లకు కలెక్టర్ పోస్టింగ్స్ ఇవ్వనున్నారు.

అటవీశాఖలో...

అటవీశాఖ విశాఖ రేంజ్ ఆఫీసర్ బిర్లంగి రామనరేష్‌ను పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం రేంజ్‌కు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న పీవీ శాస్త్రిని విశాఖ రేంజ్ ఆఫీసర్‌గా నియమించారు. విశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో రేంజ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్న డి.గంగరాజును కురుపాం రేంజ్‌కు బదిలీచేసి అతని స్థానంలో కె.శ్రీనివాసరావును నియమించారు. కనకమహాలక్ష్మి ఈవో పి.శ్రీనివాసరెడ్డిని నెల్లూరు జిల్లా పెంచలకోన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా బదిలీ చేసిన ప్రభుత్వం, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాతకు ఇక్కడ తాత్కాలిక బాధ్యతలు అప్పగించింది.

రవాణా శాఖలో

రవాణా శాఖలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేస్తున్న వి.సుందర్‌రెడ్డిని విజయవాడలో ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఐఎస్‌ఎం రామశ్రీని ఇక్కడ జేటీసీగా నియమించారు. డీటీసీ జీసీ రాజారత్నంను విజయవాడ కమిషనర్ కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న జి.ఆదినారాయణను విశాఖ డీటీసీగా బదిలీ చేశారు.

ఏడుగురు సబ్ రిజిస్ట్రార్‌లకు బదిలీ

... 5వ పేజీ తరువాయి

రోహన్‌కుమార్ పెదగంట్యాడ, విజయనగరం జిల్లా చిట్స్‌లో పనిచేస్తున్న కీర్తిప్రియ పెందుర్తి, శ్రీకా కుళం ఆడిట్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ గోపాలపట్నం బదిలీ కోరుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 31లోగా పదవీ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేయవద్దని ప్రభుత్వం సూచించడంతో ఆనందపురంలోని ఆనంద్‌కుమార్‌ను అక్కడే కొనసాగించారు. యూని యన్‌లో రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ డీవీ నారాయణ ఆ కోటాలో అక్కడే కొనసాగడానికి అనుమ తించారు. గోపాలపట్నంలో పనిచేస్తున్న మాధవిని అనకాపల్లి జాయింట్-1గా, విజయనగరంలో జాయింట్-1గా పనిచేస్తున్న నిరంజన్‌ను అనకాపల్లిలోని జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా నియ మించారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పనిచేస్తున్న కమలకు నర్సీపట్నం, ఎలమంచిలిలో పనిచేస్తున్న అప్పారావుకు లంకెలపాలెం, మధురవాడలో పనిచేస్తున్న మోహన్‌రావుకు పార్వతీపురం, నక్కప ల్లిలో పనిచేస్తున్న జిలానీ బేగం సబ్బవరం బదిలీ అయ్యారు. పాల కొండ నుంచి సీహెచ్‌ఎస్ మూర్తిని కె.కోటపాడుకు, అసైన్డ్ ల్యాండ్ వివాదంలో సస్పెన్షన్‌కు గురై కోర్టు ఆదేశాలతో భీమిలిలో విధుల్లో చేరిన సబ్ రిజిస్ట్రార్ తులసీ దాస్ రణస్థలం వెళ్లారు.

ఉద్యానశాఖలో అవినీతి మొక్కలు!

... 5వ పేజీ తరువాయి

సర్కిల్, ఆల్‌ఎబిలిటీపార్కు ఎదురుగా ఉన్న మినీపార్కులో మొక్కల సంరక్షణ, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం పనులను విస్మరించడంతో పూలమొక్కలన్నీ మాయమైపోయాయి. తుప్పలతో కళావిహీనంగా మారి నగర సుందరీకరణపై ప్రభావం చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ నుంచి గాజువాక, తాటిచెట్లపాలెం నుంచి ఊర్వశిజంక్షన్, మధురవాడ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది వరకూ జాతీయరహదారిపై పరిస్థితి ఇదే విధంగా ఉంది. అయినా అధికారులు పనులు బాగానే చేశారంటూ బిల్లులు చేసే పనిలో నిమగ్నమవడం వారి తీరుకు అద్దం పడుతోంది.

ఇద్దరు కాంట్రాక్టర్లదే హవా

జీవీఎంసీలోని ఉద్యాన విభాగంలో ఇద్దరు కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోందని ఆ విభాగం ఉద్యోగులే చెబుతున్నారు. జీవీఎంసీ పరిధిలో 60 ప్యాకేజీలుంటే అందులో 45 వరకూ వీరే దక్కించుకోవడం దీనికి ఉదాహరణగా చెబుతున్నారు. ఒక ప్యాకేజీలో పనులు చేపట్టేందుకు సగటున ఐదుగురు కూలీలు, ఒక గూడ్స్ ఆటో/ట్రాక్టర్, ఇతర పనిముట్లు అందుబాటులో ఉండాలి.కానీ ఈ కాంట్రాకర్లు తమకు దక్కిన పనులన్నింటినీ పూర్తిచేసేందుకు కేవలం పదిమందిని మాత్రమే నియమించి, వారితోనే నగరమంతటా పనిచేయిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయం ఉద్యానశాఖ అధికారులకు తెలిసినప్పటికీ ప్రశ్నించకపోవడం, బిల్లుల్లో కోత విధించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇద్దరు కాంట్రాక్టర్లు హార్టీకల్చర్ కార్యాలయంలో కూర్చొని సిబ్బందికి బిల్లుల తయారీ, టెండర్ ప్రతిపాదనలపై సూచనలిస్తారని, వారి ఆదేశాలను పాటించకపోతే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో బెదిరింపులు వస్తాయని ఆ విభాగంలోని ఒక అధికారి వాపోయారు. పైగా ఈ కాంట్రాక్టర్లు స్టీల్‌ప్లాంట్‌లో శాశ్వత ఉద్యోగులు. వారి భార్యల పేరుతో కాంట్రాక్టర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని వారే టెండర్‌లో పాల్గొంటారు. ఒక కాంట్రాక్టర్ ఏకకాలంలో రెండు, మూడు పనులను చేయడమే సవాల్‌తో కూడుకున్నదని, ఇద్దరు కాంట్రాక్టర్లే 80 శాతం ప్యాకేజీలను దక్కించుకుంటే పక్కాగా పనులు చేపట్టడం ఎలా సాధ్యమంటున్నారు. అయితే దీనికి సంబంధిత అధికారుల నుంచి సమాధానం రావడం లేదు.

40 శాతానికిపైగా లెస్‌కు

ఏదైనా పని చేపట్టేందుకు అధికారులు ముందుగా అంచనాలు తయారుచేస్తారు. ముడిసరకు, కూలీలు, యంత్రాలకు సంబంధించి ఎస్ఎస్ఆర్ రేట్లు లెక్కించి టెండరు పిలుస్తారు. ఆ మొత్తంలో కాంట్రాక్టర్‌కు 13 శాతం లాభం ఉండేలా చూస్తారు. దీంతో ఎవరైనా కాంట్రాక్టర్ టెండర్ వేస్తే గరిష్ఠంగా 13 శాతానికి మించి లెస్‌కు వస్తే నష్టం వస్తుంది. అలాంటిది హార్టీకల్చర్ విభాగంలో పిలిచే టెండర్లను ఇద్దరు కాంట్రాక్టర్లు ఏకంగా 40 శాతానికిపైగా లెస్‌తోనే దక్కించుకుంటున్నారు. ఉదాహరణకు రూ.10 లక్షల విలువైన పని అనుకుంటే దానిని రూ.ఆరు లక్షలకే చేస్తామని టెండర్ వేస్తున్నారు. ఇందులో ఈఎండీ కింద రూ.2.5శాతం, ఆదాయపన్ను రెండుశాతం, అధికారులు, సిబ్బందికి కమీషన్లు పదిశాతం ఉంటాయి. 25శాతానికి మించి లెస్‌కు వేస్తే ఆ మొత్తాన్ని అడ్వాన్సు సెక్యూరిటీ డిపాజిట్ (ఏఎస్‌డీ) చెల్లించాలి. అంటే 40శాతం లెస్‌కు వస్తే ఏఎస్‌డీ కింద రూ.1.5లక్షలు ముందే కట్టేయాలి. వీటన్నింటినీ లెక్కేస్తే రూ.10 లక్షలు పనికి రూ.నాలుగు లక్షలు, ఇతరు ఖర్చులు రూ.2.9 లక్షలు పోతే మిగిలిన రూ.3.1 లక్షలతోనే పూర్తిచేయడం ఎలా సాధ్యమన్నది సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లే చెప్పాలి.

ఏప్రిల్ నుంచి నామినేషన్‌పైనే

సాధారణంగా గడువు పూర్తయ్యేలోగా కొత్త టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవ్వాలి.కానీ హార్టీకల్చర్ విభాగంలో ఈ ఏడాది మార్చితో టెండర్ల గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ పద్ధతితో పాత కాంట్రాక్టర్లనే కొనసాగిస్తున్నారు. ఆరునెలలుగా వారే పనులు చేస్తున్నట్టు అధికారికంగా చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పచ్చదనం మాయమై, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు రూ.3.5 కోట్లు బిల్లులు చెల్లించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

త్వరలో టెండర్లు పిలుస్తాం

ఆరునెలలుగా నామినేషన్ పద్ధతిలో పాత కాంట్రాక్టర్లతోనే పనులు జరుగుతున్నాయి. ఎన్నికల కారణంగా టెండర్లు పిలవడానికి అవకాశం లభించలేదు. కాంట్రాక్టర్లు భారీ లెస్‌కు బిడ్ వేయడం వల్ల పనుల్లో నాణ్యత తగ్గుతుంది. అలాంటివారికి ఏఎస్‌డీ రూపంలో చట్టం అవకాశం కల్పించడంతో ఏమీ చేయలేకపోతున్నాం. ఇకపై ఒక కాంట్రాక్టర్‌కు రెండు, మూడు పనులు మాత్రమే దక్కేలా నిబంధనలు సవరిస్తాం. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు తమ కుటుంబసభ్యుల పేరుతో పనులు చేస్తున్నారు. వారిని కూడా అనర్హులుగా ప్రకటించి టెండర్‌లో పాల్గొనే అవకాశం లేకుండా చేస్తాం. **-దామోదర్, హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్, జీవీఎంసీ**

స్థల మార్పిడికి నో

... 5వ పేజీ తరువాయి

పరిశీలించిన కోర్టు దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీచేసిన ఉత్తర్వుల మేరకు తగిన నిర్ణయం తీసుకుని, పిటిషనర్‌కు తెలియజేయాలని ఆదేశించింది. దీంతో మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీవీఎంసీ పార్కుకు చెందిన భూమి మార్పిడి తగదని, కౌన్సిల్ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు పిటిషనర్ మూర్తి యాదవ్‌కు లేఖ పంపించారు. దీంతో వైసీపీ నేత, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అనుచరులకు షాక్ తగిలినట్టయింది.

నేడు మార్కెట్‌లలో ఆశీలు వసూలుకు వేలం

భీమునిపట్నం, సెప్టెంబరు 22 : పట్టణంలోని రోడ్డు మార్జిన్, లాల్‌బహదూర్ శాస్త్రి మార్కెట్, చిన్నబజారు కలిగొట్ల సూర్యనారాయణ మార్కెట్‌లలో ఆశీలు వసూలుకు సోమవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు జడ్సీ పి. ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాది కాలపరిమితికి గాను ఈ వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు మధ్యాహ్నం గంటలకు జోనల్ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

కాలువల్లో పూడికలు


సంజయ్‌గాంధీ కాలనీలోని ప్రధాన కాలువలో పూడిక

ఆరిలోవ, సెప్టెంబరు 22 : జీవీఎంసీ 9వ వార్డులోని పలుచోట్ల కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. కాలువల్లో పూడికలు తీసి, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని చెబుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం పనులు చేపట్టడం లేదు. ముఖ్యంగా సంజయ్‌గాంధీ కాలనీ చిల్డ్రన్ పార్కుకు ఆనుకొని ఉన్న ప్రధాన కాలువ పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్డు మీదకు వస్తోంది. దీంతో స్థానికులు ఒకవైపు దుర్వాసన, మరోవైపు దోమల వ్యాప్తితో నరకయాతన అనుభవిస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల భవన నిర్మాణదారులు డెబ్రిస్‌ను కాలువల్లో వేస్తుండడంతో ఎక్కడికక్కడే మురుగు నీరు నిలిచిపోతోంది. పాలకులు, అధికారులు స్పందించి కాలువల్లో పూడికతీతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చీకట్లో కొండవాలు ప్రాంతాలు

ఆరిలోవ, సెప్టెంబరు 22 : జీవీఎంసీ 12వ వార్డులోని కొండవాలు ప్రాంతంలో పలుచోట్ల వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చీకటిపడిన తరువాత మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ముఖ్యంగా ఈశ్వరదేవీనగర్, పెదగదిలి కొండవాలు ప్రాంతంలో పాముల భయం ఎక్కువగా ఉంది. లైట్లు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే కొన్నిచోట్ల హైమాస్ట్ లైట్లు కూడా వెలగడం లేదు. అధికారులు తక్షణమే స్పందించి ఆయా ప్రాంతాల్లో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేపటి నుంచి 'పొలం పిలుస్తోంది'

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 22 : మండలంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏఓ ఎంవీ చలం తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పంటల పరిశీలన, సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తామని ఆయన చెప్పారు.

'టీటీడీ పవిత్రతను దెబ్బతీశారు'

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 22 : వైసీపీ ప్రభుత్వం టీటీడీ పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించిందని మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ నగేష్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. లడ్డూ తయారీలో అపవిత్ర పదార్థాల వాడకం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెదఎర్రినాయుడు, రమణరాజు, కోన శ్రీనివాసరావు, సిద్దనాతి వెంకటరావు, అప్పల సూర్యనారాయణ ఉన్నారు.

కిటకిటలాడిన పర్యాటక ప్రాంతాలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 22 : బీచ్‌రోడ్డులో పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. రుషికొండ, సాగర్‌నగర్ బీచ్, బీచ్‌రోడ్డులోని పలు వ్యూ పాయింట్ల వద్ద పర్యాటకులతో సందడి నెలకొంది. నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి తదితర జిల్లాల నుంచి వందలాది మంది రావడంతో తీర ప్రాంతాలు కళకళలాడాయి. రుషికొండ బీచ్‌లో పార్కింగ్ ఏరియా వాహనాలతో నిండిపోయింది. బీచ్ రోడ్డులోనూ ట్రాఫిక్ రద్దీ నెలకొంది.

సినిమా గైడ్

● **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)

● **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),

● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ, 24, క్యారెట్ 37, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది) 105, బరబటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..


ఎండాడ చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» ఎండాడలో ఇది మంచి ప్రభుత్వం

ఎండాడ, సెప్టెంబరు 22 : కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు వరహాగిరినగర్‌లో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ గాడి తప్పాయన్నారు. ఈ నేపథ్యంలో అనుభవం గల నాయకత్వం ఆశించిన ప్రజలు కూటమి పార్టీలకు విజయాన్ని కట్టబెట్టారని తెలిపారు. అనంతరం ఆయన ఎండాడ చెరువును పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని అధికారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జోన్-2 జెడ్సీ సింహాచలం నాయుడు, నాయకులు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, చెట్టుపల్లి గోపి, శాఖరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని మూడో వార్డు స్మిత్ స్ట్రీట్ సచివాలయం పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అలాగే నేరేళ్లవలస కాలనీలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గంటా అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామ్మూర్తి, భీమిలి జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : గ్రేటర్ ఏడో వార్డు వాంబేకాలనీలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కానూరి అచ్యుతరావు, మామిడి దుర్గారావు, లొడగల భవానీ, రాము, కోటేశ్వరరావు, లావణ్య, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : రుషికొండలో కూడా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు అక్కరబోయిన రాంబాబు, గద్దిపల్లి లక్ష్మణ, సారిపల్లి శ్రీనివాసరావు, కృష్ణ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు/రామ్‌నగర్ : కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా బీచ్ రోడ్డులో వైఎంసీ వద్ద పవర్ ట్రీ పాపుల్ సోలార్ సంస్థ అధినేత ఎం. చంద్రబోస్ ఆధ్వర్యంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగకుమారి, బైరెడ్డి పోతన్నరెడ్డి, కెంభూరి ధనలక్ష్మి, పీతల అవినాష్, అఖిల్ మూర్తి యాదవ్ పాల్గొన్నారు. 19వ వార్డు పెదజాలారిపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నొల్లి నూకరత్న, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ పదోవార్డు ఎస్ఐజీ నగర్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కేతా సత్యన్నారాయణ, మద్దిల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపుపై హర్షం

భీమునిపట్నం, సెప్టెంబరు 22 : ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా దుకణాల్లో పది శాతం గీత కార్మికులకు కేటాయించాలని నిర్ణయించడం హర్షనీయమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, యాత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంగటి రాము అన్నారు. ఆదివారం ఆయన నేరేళ్లవలస కమ్యూనిటీ భవనంలో కల్లుగీత కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మద్యం షాపులను కేటాయించడం వల్ల గీత కార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కల్లుగీత సహకార సంఘాల అధ్యక్షుడు చిట్టిబోయిన రాము అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భీమిలి డివిజన్ నాయకులు రీసు రమణ, గండిబోయిన రమణ, కాకర ఎల్లారావు, నాయకులు బుత్తల నరసింగరావు, గండిబోయిన పోలిరాజు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో భారీ అన్నదానం

పద్మనాభం, సెప్టెంబరు 22 : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ రాంబాబు ప్రారంభించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం. అప్పలనాయుడు (అన్నమయ్య), బొలే అప్పలనాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

రమేశ్‌బాబుకు కర్ణాటక ప్రభుత్వం సత్కారం


జ్ఞాపికతో రమేశ్‌బాబు (కళ్లద్దాలు ఉన్న వ్యక్తి)

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గాజువాక ఆటోనగర్‌లోని వీఆర్ ఇంజనీరింగ్ వర్క్స్ యజమాని వేమూరి రమేశ్‌బాబును కర్ణాటక ప్రభుత్వం ఆదివారం ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేసింది. ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్ట్ వ్యాపారంలో ఉన్న రమేశ్‌బాబు బళ్లారిలోని జిందాల్ ప్రాజెక్టులకు కూడా సేవలందిస్తుంటారు. గత నెల వరదల వల్ల తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుపోయింది. దానిస్థానంలో స్టాప్‌బ్లాక్‌ను అమర్చే పనులను కర్ణాటక ప్రభుత్వం జిందాల్ కంపెనీకి అప్పగించింది. స్టాప్ బ్లాక్ అమర్చే పనులను ఐదు ఎలిమింట్స్‌గా విభజించగా వాటిలో ఒక ఎలిమింట్‌ను అమర్చే బాధ్యతను జిందాల్ కంపెనీ రమేష్‌బాబుకి అప్పగించింది.ఆయన 72 గంటల్లో ఎలిమింట్‌ను తయారు చేసి అందజేశారు. ఈమేరకు కర్ణాటక ప్రభుత్వం ఆయన్ను సత్కరించి, జ్ఞాపిక అందజేసింది.


చండీయాగంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి

కొనసాగుతున్న చండీయాగం

ఆరిలోవ, సెప్టెంబరు 22 : తోటగరువు ఎర్నిదుర్గమ్మ ఆలయ ఆవరణలో చండీయాగం కొనసాగుతోంది. ఆదివారం జరిగిన యాగంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సీపీకి ఘన స్వాగతం పలికారు.

మామిడిలోవలో రక్తదాన శిబిరం

ఆనందపురం, సెప్టెంబరు 22 : మండలంలోని మామిడిలోవ గ్రామంలో సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల ఏపీ సేవాదళ్ జాయింట్ కో-ఆర్డినేటర్ డి.రామారావు ఈశిబిరాన్ని ప్రారంభించారు. సత్యసాయి సేవా సంస్థలు, భక్తులు బలిరెడ్డి పెంటయ్య, బలిరెడ్డి అప్పలరాము, కోరుకొండ సంతోష్ ఆధ్వర్యంలో 70 మంది రక్త దానం చేశారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు.

ఇంటర్ విద్యార్థుల ఆందోళన

కొమ్మాది, సెప్టెంబరు 22 : మారికవలసలో మెట్రో పక్కనున్న ప్రైవేటు కళాశాలలో కనీస సౌకర్యాలు లేవని ఇంటర్ విద్యార్థులు ఆదివారం సాయంత్రం ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు తాము పడుతున్న ఇబ్బందులను కాగితాలపై రాసి భవనం పైగదుల నుంచి రోడ్డుపైకి విసిరారు. స్థానికులు గుర్తించి మీడియా దృష్టికి తీసుకువచ్చారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో రావడంతో పీఎంపాలెం పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థుల నుంచి, వారి తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు సీఐ బాలకృష్ణ తెలిపారు.



వెనక్కి వెళ్లిన సముద్రం

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని తీరం వెంబడి సముద్రం కొంత వెనక్కి వెళ్లింది. గత నెల రోజుల వ్యవధిలో సముద్రం ఇలా వెనక్కి వెళ్లడం నాలుగోసారి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదివారం చాలావరకు వెనక్కి వెళ్లడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పలువురు వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో ఇది వైరల్‌గా మారింది. దీనికి గల కారణాలపై నిపుణులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కొద్దిరోజులుగా సముద్రం లోపల డ్రెడ్జింగ్ పనులు జరుగుతున్నాయి. భారీగా ఇసుక మేటలను తీరం వెంబడి వేస్తున్నారు. దీనివల్ల తీరం ఎత్తుగా మారడంతో సముద్రం వెనక్కి వెళ్లిందన్న భావన సందర్శకుల్లో కలుగవచ్చని నిపుణుడు ఒకరు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ

ఎండాడ, సెప్టెంబరు 22 : కొమ్మాది ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం విద్యార్థి ఆత్మహత్య ఘటనపై నగర సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు విచారణ జరిగింది. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఆదేశాలతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కెమికల్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణతో పాటు పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. చంద్రశేఖర్ ఆదివారం కొమ్మాది కళాశాలలోని హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. చదువు విషయంలో ఒత్తిడికి ఏమైనా గురి చేశారా.. లేక ఇతర కారణాలు ఉన్నాయా.. అన్న కోణాల్లో విచారణ చేపట్టారు. సోమవారం మరింత లోతుగా దర్యాప్తు చేసి నివేదికను రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు ప్రిన్సిపాళ్లు వివరించారు. ఆత్మహత్యకు సంబంధించి సీపీ ఆదేశాలతో పీఎంపాలెం పోలీసులు విచారణ చేపడుతున్నారు. కాగా విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నట్టు తెలిసింది.

'ఉక్కును పూర్తి సామర్థ్యంతో నడపాలి'

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 22 : స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ అన్నారు. కూర్మన్నపాలెంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4,890 కోట్లు ఇస్తే తిరిగి రూ.55 వేల కోట్లు చెల్లించామన్నారు. ప్రైవేటు సంస్థలకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేస్తున్న ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు బ్యాంకుల్లో అప్పు తెచ్చుకునేందుకు గ్యారెంటీ ఇవ్వడం లేదని ఆరోపించారు.

కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి

అగనంపూడి : స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ కోరారు. ఇక్కడి కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపిచేయాలని కార్మికులు ఆందోళనలు చేస్తున్నా కేంద్రం ఏమీపట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ విజేతలు విశాఖ, కడప

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 22 : స్థానిక జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఇంద్రాణి జగ్గారావు స్మారక 34వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలురు, బాలికల త్రోబాల్ చాంపియన్‌షిప్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఈ టోర్నీ బాలికల విభాగంలో ఆతిథ్య విశాఖ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, కృష్ణా, విజయనగరం జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో కడప విన్నర్స్ ట్రోఫీని సొంతం చేసుకోగా, కృష్ణా జిల్లా రన్నరప్‌గా నిలిచింది. ఆతిథ్య విశాఖ తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి మిసెస్ ఏవీఎన్ కాలేజి ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మన్నాజీరావు, రవికుమార్ ఎండీ గౌస్, ఎస్.గోపీకృష్ణ, సులోచన పాల్గొన్నారు.


మూడో స్థానంలో నిలిచిన బాలుర జట్టు


త్రోబాల్‌లో విజేతల బృందం బాలికలు

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, సెప్టెంబరు 22 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక సిరి సంపెంగతో అర్చన జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

ప్రముఖులను కలిసిన సింహాచలం ఈఓ


అశోక్‌గజపతిరాజును కలిసిన ఈఓ త్రినాథరావు

సింహాచలం, సెప్టెంబరు 22 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదివారం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రముఖులను ఈఓ శాలువతో సత్కరించగా, ఆలయ వైదికులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు ఇవ్వగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 22 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవసాథనం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి 98వ వార్డు సింహపురి కాలనీకి చెందిన ఏవీ సూర్యనారాయణ, సుబ్బలక్ష్మీ దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్కు రూపంలో ఆదివారం సింహగిరిపై దేవస్థానం పీఆర్ఓ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

మొక్కలు నాటిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 22 : ఎంవీపీ పోలీస్ స్టేషన్, టాస్క్ ఫోర్స్ స్టేషన్ ఆవరణలో మనం వనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. సీఐ మురళి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సారణిదేవి, వాలంటీర్లు విక్రమ్, శ్యామ్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

'డైట్'లో ప్రపంచ నదుల దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం, సెప్టెంబరు 22 : మానవాళికి నదులే జీవనాడి అని డైట్ కళా శాల విశ్రాంత అధ్యాపకుడు డి.వెంకట సుబ్బరాజు అన్నారు. ఆదివారం ఆ కళాశా లలో పర్యావరణ కార్యకర్త,ఆ సంస్థ అధ్యాపకుడు గొట్టేటి రవి ఆధ్వర్యంలో ప్రపంచ నదుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ నదులు కలుషితం కాకుండా పరిశుభ్రంగా చూసుకోవలసి బాధ్యత అందరిపై వుందన్నారు. నదీ పరీవాహక ప్రాంతాలు, ప్రవాహ మార్గాలను కబ్జా చేయడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అనేక నదులు అంతరించిపోతున్నాయని, దీని ప్రభావం పర్యావరణంపై చూపడంతో మానవ మనుగడకు ముప్పు ఏర్పడిందని తెలిపారు. అధ్యాపకుడు గొట్టేటి రవి మాట్లాడుతూ బీచ్ పరిసరాలను శుభ్రం చేస్తున్నట్టే నదీ పరీవాహక ప్రాంతాలను కూడా పరిశుభ్రం చేయాల్సి వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనాథునికి భక్తి శ్రద్ధలతో దూర్వార్చన

సింహాచలం, సెప్టెంబరు 22 : జీవీఎంసీ 98వ వార్డు విజినిగిరిపాలెంలో స్థానిక యువజన సంఘం ఆధ్వ ర్యంలో గణనాథునికి ఆదివారం లక్ష దూర్వార్చన జరిపారు. తొలుత భక్తులు, కమిటీ సభ్యుల గోత్రనామాలతో సంకల్పించి వినాయకుడి సహస్ర నామావళితో దూర్వాలతో పూజలు చేశారు. ప్రత్యేక నివేదలు, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని అడివివరం సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైసీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో అడివివరం సొసైటీ డైరెక్టర్లు మజ్జి ధర్మరాజు, బోర ప్రసాద్‌రెడ్డి, పాలూరి సూరిబాబు, పీతల అప్పలరాజు, టీడీపీ నాయకులు బంటుబిల్లి మహేష్, మజ్జి చంద్ర శ్రీనివాసరావు, మజ్జి కోటేశ్వరరావు, కందాళ ఫణిమనోహర్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధపూరితంగా రామన్నపేట

తగరపువలస, సెప్టెంబరు 22 : జీవీఎంసీ రెండవ వార్డు పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రామన్నపేట గ్రామస్తులు వర్షం పడితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. గ్రామంలో మురుగు కాలువలు లేవు.. ఉన్న ఒక్క కాలువ పూడికలతో నిండిపోయింది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ నీరు రహదారిపై అడుగుమేర ప్రవహిస్తోంది. కాలువల్లో మురుగు నీరు కూడా ఈ నీటితో కలిసిపోవడంతో దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో చెత్త కూడా తొలగించడం లేదు. వర్షం పడితే సమీపంలో ఉన్న అపార్టుమెంట్ల సెల్లార్లలోకి కూడా నీరు చేరిపోతోంది. జీవీఎంసీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా కాలువల నిర్మాణంతో పాటు మురుగు నీటి పారుదలకు వీలుగా ఔట్‌లెట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కంబాల కొండపై స్వచ్ఛతా హీ సేవా

ఆరిలోవ, సెప్టెంబరు 22: కంబాల కొండ పార్కు ట్రెక్కింగ్ మార్గంలో పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. పోర్టు సిబ్బంది, క్రీడా విభాగం, పలు పాఠశాలల విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ మార్గం శుభ్రపరిచారు. పాల్గొన్న వారికి పోర్టు అథారిటీ అధికారులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు అథారిటీ కార్యదర్శి టి. వేణుగోపాల్, సీఎంఈ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 22 : మండలంలోని పెదనాగమయ్యపాలెం పంచాయతీ పాత పాలెంనకు చెందిన పెయింటర్ దల్లి అప్పలరెడ్డి (31) అదృశ్యంపై అతని భార్య నూకరత్నం స్థానిక పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. గత మార్చి 2న ఇంటి నుంచి వెళ్లిన అప్పలరెడ్డి తిరిగి చేరలేదన్నారు. ఈనెల 1న రాజమండ్రిలో ఆయన రేషన్ తీసుకున్నట్టు సమాచారం రావడంతో ఆయన అదృశ్యం వెనుక అనుమానాలు ఉన్నాయని ఆమె పేర్కొంది. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.62 లక్షలకు వినాయక లడ్డూ వేలం

ఆనందపురం, సెప్టెంబరు 23 : వేములవలసలో వాయుపుత్ర గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 162 కిలోల లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూను గ్రామ ఉప సర్పంచ్ నవీన్ జ్ఞానేశ్వర్ రూ.1,62 లక్షలకు పాడి దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు లడ్డూను అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పద్మనాభం, సెప్టెంబరు 22 : వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. బీఆర్ తాళ్లవలసకు చెందిన నూలు అప్పారావు (90) ఈనెల 14న తన ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అయన్ను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈనెల 21న మృతి చెందాడు. మృతుడి కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.